


చైతన్య భావ సుమాలు



స్వామి సుందర చైతన్యానంద




చైతన్య భావ సుమాలు



చైతన్య భావ సుమాలు

చైతన్య భావ సుమాలు
స్వామి సుందర చైతన్యానంద
ప్రథమ ముద్రణము } - 2002 సంవత్సరం
- 5000 కాపీలు.
(సర్వ స్వామ్యములు ట్రస్టువి)
కవర్ డిజైన్ :
అశోక్
ప్రతులకు :
సర్వజ్ఞ కల్చరల్ ట్రస్ట్,
సుందర చైతన్యాశ్రమం,
హైదరాబాద్ - 500 043.
☎ :(08418) 255355,
(08418) 255777

స్వామి సుందర చైతన్యానంద



ఆనంద సుగంధం

పువ్వులలో అంద ముంటుంది. తియ్యని సువాసన ఉంటుంది. రంగుల హంగు లుంటాయి. రంగురంగుల పొంగు లుంటాయి.

పువ్వులు నవ్వుతాయి. కొందరితో మాట్లాడుతాయి. కొందరికి కథలు చెబుతాయి. మరి కొందరితో కలిసి పాడుతాయి.

తరతమ భేదాలు పువ్వులకు తెలియవు.
గుమ్మాలను గుడిగా మలుస్తాయి.
ముద్దుగుమ్మల జడలను మురిపిస్తాయి.
ముకుందుని మెడను అలంకరిస్తాయి.

ముంజేతికి కంకణా లవుతాయి. మెడను చుట్టి మాల లవుతాయి. సిగలో నెలరాజులా నిగ నిగ మంటాయి. వెలుగు లారిన దేహాలను కూడా తమ కాంతులతో అలంకరిస్తాయి.

పువ్వులా నవ్వే దెలాగు?
నవ్వులు పువ్వులుగా మారే దెపుడు?
సమత్వంతో
నవత్వంతో
మానవత్వంతో
మహిమతో
మానవజాతి మనుగడను సాగించే దెప్పుడు?

జ్ఞానం కలిగినప్పుడే. పవిత్రమైన జ్ఞానం ప్రసాదరూపంలో హృదయంలో నిలిచినపుడే. అంతర్య వనవాటికలో జ్ఞాన సుమాలు విరబూసి నపుడే. చైతన్య కుసుమాలు వికసించి నపుడే.

పువ్వులతో అందరూ పూజ చేస్తారు. చైతన్య సుమాలతో పరమాత్మను కొందరే అర్చించ గలరు. పువ్వులతో పూజించటం మనకు ఇష్టం. చైతన్య పుష్పాలతో పూజిస్తే పరమాత్మకు ప్రియం.

లలితా సహస్రనామం జగన్మాతను "చైతన్య కుసుమప్రియా" అనే నామ సుమంతో అర్చించింది.

అందుకే ఈ చైతన్య కుసుమాలు.

ఇందులో అష్టోత్తర శత సుమా లున్నాయి. ఇవన్నీ విడిపూలు. దేనికి అదే. దేని అందము దానిదే. దేని సువాసన దానిదే. వివిధములైన రంగులతో, వాసనలతో, కళాకాంతులతో శోభించే పువ్వులన్నీ పూజా వేళ పరమాత్మ అడుగుల కడ ఒక్కటిగ పడి ఉన్నట్లు, వివిధములైన వాక్య వర్ణములతో, భావ సౌరభాలతో విజ్ఞాన వెలుగులను విరజిమ్మే చైతన్య కుసుమాలు ముట్టుకున్న వారిని, పట్టుకున్న వారిని మరీ పనిగట్టుకొని పరమాత్మ పవిత్ర పాదాల చెంతకు నడిపిస్తాయి.

పువ్వులు తేలికగా ఉంటాయి.

చైతన్య కుసుమాలు కూడా అంతే.

పన్నీటి స్నానం చేయించలేవు. కాని, గంధాన్ని చల్లినట్లు, చిలకరించినట్లు హాయి నిస్తాయి.

పన్నీటి గంధమును చల్లగానే మేను పులకరిస్తుంది. మనసు పరవశిస్తుంది. చైతన్య కుసుమాల జ్ఞాన సుగంధాలు చిత్తాన్ని చలింప చేస్తాయి. మనో తరంగాలను కదిలిస్తాయి.

పెద్ద కార్యంలో తలదూర్చిన బుద్ధి కార్యం కనుక, చిన్న పనే అయినా పెద్ద మనస్సుతో ఈ చిన్ని పుస్తకాన్ని అందిస్తున్నాము.

అన్నీ విడిపూలే.
విడివిడిగా వెలుగుతూ ఉంటాయి.
తడితడిగా చల్లగా ఉంటాయి.
మంచి మనసులాగ మెత్తగా ఉంటాయి.

ఆఘ్రాణించండి. నాసికానికి అందిన సుగంధము మనస్సును చేరినట్లు, మనస్సును చేరిన భావ సుమాలు హృదయాన్ని తాకుతాయి. హృదయేశ్వరుని కదిలిస్తాయి. ఇక్కడ కదలికలే మెలకువలు. మేలుకొలుపులు.

మీ

స్వామి సుందర చైతన్యానంద

చైతన్య భావ సుమాలు

విషయ సూచిక



పుష్పాంజలి

అది గురువారం.
భక్తులు ఆశ్రమంలో గురుదేవుని సందర్శించుకొనే వారం.
సుదర్శనంలో దర్శనాలు ముగిసిన సమయం.

ఒక ప్రక్కగా నిలబడియున్న నాకు ఆపాదమస్తకం తమను కప్పియున్న పూలమాలను చూపుతూ పూజ్య గురుదేవులు

"వీరందరు భక్తితో నా మెడను అలంకరించేందుకు
ఈ పూలమాలలు తెచ్చారు. ఎంతో డబ్బు వెచ్చించారు.
వీరికి నేనేమి కొని ఇవ్వగలను? నా హృదయంలో విరబూసిన
భావ కుసుమాలను కోసి ఇవ్వడం తప్ప" అన్నారు.

బదులు చెప్పలేని నేను చెమర్చిన కళ్ళతో అలా చూస్తూ ఉండిపోయాను.

పూజ్య గురుదేవుల భావనకు అందమైన రూపకల్పనయే ఈ 'చైతన్య భావ సుమాలు' అనే పుస్తకం.

ఇది పూజ్య స్వామి వారి 55వ జన్మదినోత్సవ సందర్భం. కొండంత కార్యభారాన్ని మోస్తూ, చివరి రెండు రోజులలో తమ అమృత హస్తాలతో ఈ పుస్తకాన్ని అందంగా రూపుదిద్ది ఇచ్చారు శ్రీ స్వామీజీ.

ఇందులో ఉన్నవన్నీ కాలంలో పసివాడని, వాసనవీడని భావసుమాలు. మన బ్రతుకుల్ని బాగుచేసి జ్ఞానంతో గుబాళింప చేసేందుకు ఉన్న దివ్య పారిజాతాలు.

గ్రంథం అందంగా ముస్తాబైంది. అందమైన ఈ సుమాల మధ్య గురుగోవిందుల చరణ కమలాలను దర్శించాలని అభిలషించి, పైనున్న గోవిందుని, మన కొరకు క్రిందికి దిగిన గురుదేవుని అష్టోత్తరాలను జోడించి భక్తులకు అందించాలని సంకల్పించాము. అందిస్తున్నందుకు సంతోషిస్తున్నాము.

గురుగోవిందుల సేవలో,

సి. పద్మ.

చైతన్య భావ సుమాలు



1. ఓం శ్రీకృష్ణాయ నమః
శ్రీకృష్ణదేవునకు నమస్కారము.

ఇది చాలదా?

ఏదో లేదని అనుక్షణం ఆవేదన పడుతూ
యెదను ముక్కలు చేసుకుంటున్నాం.
ఏమి లేదని ఈ బాధంతా?

పుట్టుకతోనే కొందరు కుంటివాళ్ళు.
చూస్తూ చూస్తూ కొందరు గ్రుడ్డివాళ్ళు.
కొందరు కిడ్నీ లేనివాళ్ళు.
కొందరు క్యాన్సరు ఉన్నవాళ్ళు.

అలా చూస్తే,
మన మెంత అదృష్టవంతులం?
ఎంత ఘనమైన భాగ్యవంతులం?
పొట్టచేత పట్టుకొని తిరిగే ఎందరో నిరక్షర కుక్షులున్న ఈ ప్రపంచంలో,
ఈ పుస్తకాన్ని చేత పట్టుకొని చదివే మనం పుణ్యాత్ములం కామా?
ఏదో లేదని అర్థం కాని దానిని గూర్చి చింతించడం కన్నా, ఉన్నదానిని
సరిగా అర్థం చేసుకుంటే ఎంతగానో తృప్తితో జీవించవచ్చు.

1. ఓం సద్గురవే నమః
సద్రూపుడైన గురుదేవునకు నమస్కారము





2. ఓం కమలానాథాయ నమః
లక్ష్మీపతికి నమస్కారము.

తప్పదు మరి

'నువ్వు నాకు వద్దు.....పో'
అని మనం నమ్ముకున్న ప్రపంచం
మనల్ని వంచించే రోజొకటుంది.

'నన్ను నీవు ఇక పీల్చలేవు'
అని జాలి లేకుండా
గాలి మనకు దూరమయ్యే క్షణం ఒకటుంది.

'ఇక మేము నీకు కనిపించము వెళ్ళు'
అని ప్రపంచంలో రంగులు, రూపాలు
కళ్ళను నెట్టేసి తలుపులు మూసేసే నిముషం ఒకటుంది.

'ఇక నా వల్ల కాదు - నేను గంట కొట్టలేను'
అని గుండె చతికిలబడే సమయం కూడా ఉంది.

వీటి మధ్యే మనం ఉన్నాం.
ముందు ఇది అర్థమైతే,
ఆ తరువాత ఎటు పోవాలో ఆలోచించవచ్చు.

2. ఓం సచ్చిదానంద రూపాయ నమః
సచ్చిదానంద స్వరూపునకు నమస్కారము





3. ఓం వాసుదేవాయ నమః
వాసుదేవునకు నమస్కారము.

ముచ్చటైన మూడు

సచ్చిదానందం
ఎంత మంచి మాట! ఎంత చక్కని తోట!
ఎంతవారికైనా అంతు చిక్కని వేట!
ఇంతింతై వటు డంతయైన వేదాంత కోట!
చింత దీర్చు మాట! సచ్చిదానంద బాట!

ముజ్జగాలను మురిపించే
ఆనందంలో మైమరపించే
మూడు మాటల మధురామృతమే సచ్చిదానందం.

సత్ - చిత్ - ఆనందం.
ఇవి మాటలు కావు; మణులు. మాణిక్యాలు.
మృత్యువును కబళించే అమృతరూపాలు.
కలలను, కలతలను చెదరగొట్టే వెలుగులు.

ఇవి కారిపోని సంపదలు. మారిపోని సౌందర్యాలు.

దొరలు దోచలేని సిరులు. దొంగలు కొల్లగొట్టలేని సంపదలు.

3. ఓం సత్సంగ ప్రచారకాయ నమః
భగవంతుని సాంగత్యమును కల్పించు వారికి నమస్కారము





4. ఓం సనాతనాయ నమః
శాశ్వతుడైన వానికి నమస్కారము.

కలిసి పుట్టాం

ఈ ప్రపంచంలోకి మనం వట్టిచేతులతో రాలేదు.
ప్రారబ్ధాన్ని వెంటపెట్టుకొని వచ్చాం.
ఏదో చెయ్యాలని విర్రవీగినా
చేయగలిగింది మాత్రమే చెయ్యగలం.
ఇది అర్థమైతే,
ఆ తరువాత, ఎంతో, ఎంతెంతో చేయాలనే ఉబలాటం కన్నా,
ఏ కొంత చేసినా,
అది అందంగా, అర్థవంతంగా ఉంటుంది.
సుఖసంతోషాలతో బ్రతుకును శోభింపచేస్తుంది.

4. ఓం సర్వసంగ పరిత్యాగినే నమః
సకల బంధములను సన్యసించిన వారికి నమస్కారము





5. ఓం వసుదేవాత్మజాయ నమః
వసుదేవుని కుమారునకు నమస్కారము.

మట్టిలోనే మాణిక్యం

దేహము ఒక ఓటి కుండ. ఏనాడైనా బ్రద్దలయ్యేదే.
మనసొక పిచ్చిముండ. ఎప్పుడైనా వీధిన పడేదే.

అభిమానంతో కాలేది దేహం.
అహంకారంతో కాగేది చిత్తం.

ఇంతని చెప్పగలమా చచ్చే తనువును.
అంతని చెప్పగలమా చంపే మనస్సును.
ఎంతని చెప్పగలము జీవి దుఃఖాన్ని?

పరమాత్మ అనుగ్రహాన్ని పొందితే,
కష్టం కరిగిపోతుంది.
దుఃఖం పారిపోతుంది.
చావు చచ్చిపోతుంది.
మనం బ్రతికి పోతాం. భగవంతునిలో బ్రతికి ఉంటాం.



5. ఓం సకల విద్యా నిలయాయ నమః
సమస్త విద్యలకు నెలవైన వారికి నమస్కారము



6. ఓం పుణ్యాయ నమః
పుణ్యనిలయునకు నమస్కారము.

పోయింది పొల్లు - నిలిచింది చాలు

'ఇది నాది' అనుకుంటే
అది దూరమైన నాడు 'నాది పోయింది' అనుకోవటం జరుగుతుంది.
'నాది' అనుకోకపోతే, పోయిన రోజు
'అది పోయింది' అవుతుందే గాని
'నాది పోయింది'గా ఉండదు.
మనం గ్రహించని దానిని మననుండి ఎవ్వరూ గ్రహించలేరు.
ఉండేవి ఉండనీ.
ఉన్నవన్నీ మనవి కానవసరం లేదు.
మనవిగా ఉండ నవసరం లేదు.
మనవైతే మనల్ని విడిచిపెట్టి ఎందుకు వెళ్తాయి?
మనకు జ్వరం ఉంది. తలనొప్పి ఉంది.
అజీర్ణము ఉంది. అజ్ఞానము ఉంది.
ఇవన్నీ,
పోకుండా మనకే ఉండాలా! మన వద్దే ఉండాలా?

6. ఓం సదా ద్వాదశాక్షరీ మంత్ర ప్రచారకాయ నమః
ఎల్లప్పుడు 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనెడి దివ్య మంత్రమును ప్రచారము చేయువారికి నమస్కారము





7. ఓం లీలామానుష విగ్రహాయ నమః
అద్భుత లీలలను ప్రదర్శించుటకై మాన వాకృతిని ధరించిన వానికి నమస్కారము.

జాగరణ

పిల్లలు మేలుకొని ఉన్నా ఏదీ అర్థం చేసుకోలేరు.
నిద్రపోతే పెద్దలకు ఏదున్నా అర్థం కాదు.
పెరిగితే పిల్లలు తెలుసుకుంటారు.
మేలుకుంటే పెద్దలు గ్రహిస్తారు.

ఇదే జాగరణ. జ్ఞాన జాగరణ.
జ్ఞానంలోనే ఏదైనా తెలిసేది.

కనుక,
ఏది ఉంది - ఏది లేదు?
ఎవరు ఉన్నారు - ఎవరు లేరు? అనేది ముఖ్యం కాదు.
జ్ఞానం ఉందా? లేదా? అనేదే ప్రధానం.



7. ఓం సర్వదాఽఽత్మరతాయ నమః
నిరంతరం ఆత్మయందు రమించు వారికి నమస్కారము



8. ఓం శ్రీవత్స కౌస్తుభ ధరాయ నమః
శ్రీవత్సమనెడి పుట్టుమచ్చను, కౌస్తుభ మణిని ధరించిన వానికి నమస్కారము.

ఎవరికి కావాలి?

భగవత్ప్రీత్యర్థం కర్మ చెయ్యాలి అంటారు.
నేను ఏ కర్మ చేస్తే భగవంతునికి ప్రీతి? ఏది అప్రీతి?
నేను కర్మ చేస్తే,
ఆ కర్మ ఫలం నాకు వస్తుంది గాని పరమాత్మకు ఎలా పోతుంది?
ఒకరు భోంచేస్తే మరొకరికి ఆకలి తీరుతుందా?

అయినా, నా కర్మఫలం పరమాత్మకు ఎందుకు?
కర్మఫలాన్ని నాకు ప్రసాదించేది అతడు కాదా?
అనంతుడైన పరమాత్మను తృప్తిపరచేది నా కర్మఫలమా?

రాగద్వేషాలు అంటకుండా
అహంకారం సోకకుండా
కర్మ లాచరిస్తే నేను ప్రశాంతతను పొందుతాను.

ఇది నాకు కలిగే ప్రీతి. తృప్తి. సంతృప్తి.
ఇది అర్థం గాక
పరమాత్మతో కూడా బేరాలు సాగిస్తున్నాం.
వ్యాపారాలు కొనసాగిస్తున్నాం.

8.ఓం సర్వగతాయ నమః
అంతట నిండియున్న వారికి నమస్కారము





9. ఓం యశోదావత్సలాయ నమః
యశోదాదేవి వాత్సల్యమునకు పాత్రుడైన వానికి నమస్కారము.

పుణ్యకాలం

కాలం నాకు అనుకూలం కాకపోవచ్చు.
భగవంతునికి ప్రతికూలం కాగలదా?
కాల రూపంలో ఉన్నది పరమాత్మ కాదా?
ఇది అర్థమైతే, ఏ కాలమైనా అనుకూలమే.

ఈ క్షణంలో నా మనస్సులో రాముదున్నాడు.
ఇది నాకు రాహుకాలం కాదు, రామకాలం.

రాహువు రాణించని
కేతువు కనిపించని కమనీయకాలం.
పుణ్యకాలం. పవిత్రమైన కాలం. పరమాత్మ కాలం.

యమగండం తెలియని కాలం.
సుడిగుండం అర్థం గాని కాలం.

దైవం అండగా, దండిగా, నిండుగా నిలిచిన
పండు వెన్నెలల కాలం
పండే నవ్వుల కాలం.



9.ఓం సాధురూపాయ నమః
మంగళకర రూపునకు నమస్కారము



10. ఓం హరియే నమః

శ్రీహరి యొక్క అవతారమూర్తికి నమస్కారము.

వస్తే రాని - పోతే పోనీ

లేనిదానిని ఈ ప్రపంచంలో శ్రమించి పొందవచ్చు.
పొందిన దానిని ఎంతోకాలం నిలుపుకోలేము.

కష్టపడి పొందిన దానిని
తేలికగా పోగొట్టుకున్నప్పుడు
గుండె ఎవరికైనా బరువెక్కుతుంది.

గుండెభారంతో, హృదయతాపంతో
గుబులు పుట్టిన గుండెతో, దిగులు నిండిన మనస్సుతో
బ్రతుకును ఈడ్చుకుంటూ పోవడం
అందరికీ సాధ్యపడే పని కాదు.

పొందేవి ఏవయినా పోయేందుకే వస్తున్నాయని
అవి రాకముందే గ్రహించగలిగితే, ఆ తరువాత
అవి రాకపోయినా
లేదా వచ్చిపోయినా బ్రతుకులో పెద్ద తేడా ఉండదు.



10.ఓం స్థితప్రజ్ఞాయ నమః

ప్రజ్ఞాన ఘన స్వరూపమునందు స్థిరు లైన వారికి నమస్కారము



11. ఓం చతుర్భుజాత్త చక్రాసి గదా శంఖాద్యుదాయుధాయ నమః

శంఖ చక్ర గదాది ఆయుధములను ధరించిన చతుర్భుజునకు నమస్కారము.

లోచూపు

చూడకూడని వాటిని చూడకపోవడం బహిరంగ సాధన.
చూసినా మనస్సు వాటిని పారేసుకోవడం అంతరంగ సాధన.

వినకూడని వాటిని వినకపోవడం బహిరంగ సాధన.
వినినా మనస్సు వాటిని జారేసుకోవడం అంతరంగ సాధన.

బాహ్యంలో చలనం ఉంటే ఉండొచ్చు.
ఆంతర్యంలో మాత్రం సంచలనం లేదు.

ఇది రాగం లేని స్థితి.
ద్వేషం రాలేని పరిస్థితి.

లేని రాగం తెచ్చే దేముంటుంది?
రాలేని ద్వేషం కొనితెచ్చే దేముంటుంది?
రాగద్వేషాలు లేని కర్మలలో అప్రియ మెక్కడుంది?
అశాంతి ఎలా వస్తుంది?

11.ఓం సుమధుర గాయకాయ నమః

తేనె లొలుకు గానవైదుష్యము గల వారికి నమస్కారము





12. ఓం దేవకీనందనాయ నమః
దేవకీ పుత్రునికి నమస్కారము.

సిద్ధం

సుఖానుభూతిలో
'ఇక్కడ' అనేది ఉంటుందే గాని 'అక్కడ' అనేది ఉండదు.
'ఇప్పుడు' అనేది ఉంటుందే గాని 'అప్పుడు' అనేది ఉండదు.

పదవి వస్తే, 'ఇప్పుడు పదవిలో ఉన్నాను' అంటాము.
ధనం వస్తే, 'ఇప్పుడు ధనవంతుణ్ణి' అంటాము.
ఆరోగ్యంగా ఉంటే, 'ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాను' అంటాము.
పోటీలో గెలిస్తే, 'ఇప్పుడు గెలిచాను. ఆనందంగా ఉంది' అంటాము.

సుఖం ఎప్పుడు కలిగినా,
అది 'ఇప్పుడు' గానే తెలుస్తూ ఉంది.
అలాంటప్పుడు
సుఖపడేందుకు 'ఇప్పుడు' ఎప్పుడు వస్తుందా!
అని నిరీక్షించడం కన్నా,
'ఇప్పుడు' ఇక్కడే, ఇప్పుడే ఉంది కనుక
వెంటనే సుఖపడితే అడ్డు నిలిచేవారు ఎవరున్నారు?

12. ఓం షడ్గుణైశ్వర్య సంపన్నాయ నమః
ఆరు కళ్యాణ గుణములను సంపదగా
గలిగినవారికి నమస్కారము





13. ఓం శ్రీశాయ నమః
ఐశ్వర్యములకు నాథుడైన వానికి నమస్కారము.

వద్దు - కావాలి

కాలసర్పం కాచుకోనుంది.
చివరి రెప్పపాటును చూడాలని కాలుడు కులుకుతున్నాడు.
పెనుతుఫాను ఏ క్షణాన ముంచుకొస్తుందో తెలియదు.
చిల్లుల జల్లెడలో మిగిలే దేమిటో అర్థం కాదు.

ఉన్నవారందరూ లేనివారే.
ఒకనాడు లేకుండా పోయేవారే.
కుండల్లాగా పగిలేవారే.
కట్టెల్లాగ కాలేవారే!

ఉన్నవాడే పెట్టగలడు. లేనివాడు ఏమి పెట్టగలడు?
ఉన్నవాడివి నీవు. కృష్ణా! హృదయమున్నవాడివి నువ్వు.

నాకు మడులొద్దు. నీ అడుగు లొత్తుతూ పడి ఉండనీ.
మాన్యాలొద్దు. మననమే మనుగడగా మారనీ.
ధాన్యాలొద్దు. సదా నీ ధ్యానమే కొనసాగనీ.

కరిగే ధనమొద్దు. తరిగే జనమొద్దు.
కరగని, తరగని భక్తి సంపదను అనుగ్రహించు.
భద్రంగా దాచుకుంటాను.
చోరులు దోచుకోకుండా చూసుకుంటాను.

చూసుకుంటూ ఉంటాను.
నిన్ను చూసుకుంటూ ఉంటాను.
ఒకనాడు నిన్ను చూసుకుంటూ పోతాను.



13.ఓం జ్ఞాన గమ్యాయ నమః
జ్ఞానము చేత పొందదగిన వారికి నమస్కారము



14. ఓం నందగోపప్రియాత్మజాయ నమః
నందగోపుని ప్రియపుత్రునకు నమస్కారము.

అబ్బ!

అవసరాలకు మించిన ఆస్తులు
అంతర్యంలో ఒత్తిళ్ళను పెంచుతాయి.
గందరగోళాన్ని సృష్టిస్తాయి.
తూర్పులో పడమరను చూపిస్తాయి.

ఆశలన్నీ చెడ్డవి కావు.
పేరాశలు ఎప్పుడూ మంచివి కావు.

'చాలు' అనేది చిన్న పదమే.
ఆ ఒక్క మాటను పలకడానికి మనిషికి యుగాలు సరిపోలేదు.

చాలు అని తృప్తి చెందే ఒక్క క్షణం కోసం
ఎన్ని జన్మలు దొర్లిపోయాయో!
ఎంతకాలం కారిపోయిందో!

ఇలా - అలా ఎంతకాలం?
ఈ క్షణమే చాలు.
చాలు అని పలికేందుకు ఈ క్షణమే మేలు.

అలం..... చాలు.... **ENOUGH**

14ఓం జ్ఞాన రూపాయ నమః
జ్ఞానమే తమ స్వరూపమైన వారికి నమస్కారము





15. ఓం యమునావేగ సంహారిణే నమః
యమునానదీ ప్రవాహవేగమును నిరో
ధించిన వానికి నమస్కారము

చేరింది చెదరనీ!


ప్రయాణంలో ధూళి అంటకపోదు.
ధూళి అంటడం తప్పు కాదు.
దులపకపోవడం తప్పు.

అనంత జీవన యాత్రలో మనమందరం బాటసారులం.
ధూళి చేరుతూ ఉంది.
అనేక జన్మలనుండి తెరలు, పొరలుగా చేరిపోతూ ఉంది.

అయితే ఏమైంది?
దుమ్ము చేరినంత మాత్రాన దర్పణం పాడుకాలేదు.
దుమ్మును దులిపేస్తే, మరుక్షణంలో దర్శనం ప్రాప్తిస్తుంది.

దులపడం ధ్యానం.
దర్శనం జ్ఞానం.

15. ఓం జ్ఞాన బోధకాయ నమః
జ్ఞానమును బోధించు ఆచార్యునకు నమస్కారము





16. ఓం బలభద్ర ప్రియానుజాయ నమః
బలరాముని ప్రియసోదరునకు నమస్కారము

సందేహ మెందుకు?

ఎన్నో, మరెన్నో ఉన్న ఈ ప్రపంచంలో
తృప్తి చెందాలంటే ఎన్నో చెయ్యాలి. ఎన్నెన్నో చెయ్యాలి.
ప్రయత్నాలే మనం చెయ్యగలం.
ప్రయత్నాలన్నీ ఫలిస్తాయా?
కొన్ని ఫలిస్తే తృప్తి వస్తుందా? అన్నీ ఫలిస్తే తృప్తి కలుగుతుందా?
అన్నీ ఫలించాలి.
ఎన్నని? ఎంతకాల మని?
కనుక, ఏవో ఏవో పొంది
తృప్తిని పొందలేక అలమటించే కన్నా
తానే తృప్తి అని గ్రహించగలిగితే
అన్నిటినీ ఏకకాలంలో పొందిన అనుభూతి కలుగుతుంది.
ఇలాంటి అరుదైన అనుభూతి ఉన్నదా?
ఉంది. (అస్తి)
దానిని నిరూపించేందుకే ప్రమాణంగా వేదాంతం శోభిస్తోంది.

16. ఓం జ్ఞాననిష్ఠాయ నమః
జ్ఞానమునందే నిలిచియున్న వారికి నమస్కారము





17. ఓం పూతనా జీవితహరాయ నమః
పూతన ప్రాణములను హరించిన వానికి
నమస్కారము.

నిర్వాకం

గోవత్సము గోవును అనుసరిస్తుంది.
కర్మఫలం కర్తను వెంబడిస్తుంది.
విడిచిన బాణం వెనక్కి రమ్మంటే రాదు.
చేసిన కర్మ ఫలాన్ని ఇవ్వకుండా పోదు.

పారిపోతే పాపాలు కరిగిపోవు.
చిత్తానికి అనుగుణంగా చట్టాలు మారవు.

జరిగేవి జరుగక మానవు.
మెల్లమెల్లగా పరమాత్మకు సమీపంగా జరగడం
మనసును సమీపానికి జరపడం
ఈ రెండే మనం చేసి చూడవలసినవి.
చూసి చేయవలసినవి.



17.ఓం జ్ఞానబ్రహ్మణే నమః
జ్ఞానబ్రహ్మకు నమస్కారము



18. ఓం శకటాసుర భంజనాయ నమః
శకటాసురుడను రాక్షసుని వధించిన వానికి నమస్కారము.

వేడుక

అదుపు తప్పితే కుదుపు తప్పదు.
పొదుపు కుదిరితే చెడుపు ఉండదు.
మితమే ఎన్నడైనా హితం.
అతి లేని కార్యమే సముచితం.

చిన్నవాటిని పెద్దగా ఊహించి చిన్నబోయే కన్నా
పెద్దవి కూడా చిన్నవే అనే పెద్ద మనస్సుతో
వచ్చేవాటిని వలచక
రానివాటికి వగచక
వెన్నెలలాగా చల్లగా శోభించటమే సాధన.

18.ఓం ధ్యానరూపాయ నమః
ధ్యాన స్వరూపునకు నమస్కారము





19. ఓం నందవ్రజ జనానందినే నమః
నందగోకులము నందలి పుణ్యాత్ములను
ఆనందింపజేసిన వానికి నమస్కారము.

అది అల - నీవే కళ

మనసును ఖాళీ చేస్తే
మనస్సు ఖాళీ కావచ్చు. మనిషికి సుఖం వస్తుందా?
మనస్సు ఎగిరి పడుతున్నా
తాను ఖాళీగా, శాంతంగా ఉన్నట్లు తెలిస్తేనే సుఖం.

సముద్రాన్ని వీక్షించడానికి
అలలు అవరోధాలు కావు.

ఈ సత్యం అర్థమైతే
అలల పొంగులు
అధికంగా సౌందర్యాన్ని అందించినా
అపరిమిత ఆనందాన్ని ముందుంచినా
ఆశ్చర్యపడ నవసరం లేదు.



19. ఓం ధ్యానబోధకాయ నమః
ధ్యాన విధిని బోధించు యోగి వర్యులకు నమస్కారము



20. ఓం సచ్చిదానంద విగ్రహాయ నమః
సత్, చిత్, ఆనందములను దేహముగా గల వానికి నమస్కారము.

ఉన్నది ఊరేగాలి

మనకు ఏది లేదు? ఎంత లేదు? అనేది అనవసరం.
మన కున్న శక్తిని మనం వినియోగిస్తున్నామా?
కుంటివారు ఎలాగూ నడవలేరు.
నడిచే శక్తి ఉన్నవారు ఎందరు నడుస్తున్నారు?
పిల్లలు ఆలోచించ లేరు.
పిచ్చివాళ్ళు ఏమి ఆలోచిస్తారో వాళ్ళకే తెలియదు.
ఆలోచించగలిగే వాళ్ళు సరిగా ఆలోచిస్తున్నారా?

చేయగలిగింది చేస్తున్నారా?
చేయగలిగిందే చేయలేనపుడు, ఇక
చేయవలసింది ఏమి చేస్తారు?

ఉన్నది ఉన్నతిని పొందేది వినియోగములోనే.
వినియోగానికి అనుకూల పరిస్థితుల్ని, సానుకూల కార్యాలను ఎవరికి వారుగా సృష్టించుకోవాలి.
ఆ తరువాత
ఆ దిశగా ప్రయాణాన్ని ఉత్సాహంతో సాగించాలి.
అంతే. ఆ క్షణం నుండే జీవితం దివ్యంగా శోభిస్తుంది.



20. ఓం జ్ఞానభాస్కరాయ నమః
అజ్ఞాన చీకట్లను తొలగించు జ్ఞాన సూర్యునికి నమస్కారము



21. ఓం నవనీత విలిప్తాంగాయ నమః
వెన్నచే పూయబడిన దివ్య దేహము గలవానికి నమస్కారము.

ఇదీ విషయం

నాకు ఈ రోజు భగవంతుని దయ లభించింది
అంటూ ఉంటారు మనుషులు తాము అనుకున్నది జరిగితే.
ఇక్కడే మనిషి మనసు పరమాత్మ విషయంలో చిన్నబోయింది.

పరమేశ్వరుని దయ ఈరోజే నీకు లభించిందా?
తల్లి గర్భంలో ఉన్నప్పుడు లేదా?
పెరిగేటప్పుడు లేదా?
వివాహ మైనపుడు లేదా?
సంతానం కలిగినపుడు లేదా?
నిన్న లేదా? ఈ రోజేనా కలిగింది?

అయన దయ ఎప్పుడూ ఉండనే ఉంది.
నీవు అనుకున్నది ఈరోజు జరిగింది.
దయ ఉంది అనుకుంటున్నావు.

అన్నీ ఆయన దయతోనే జరుగుతున్నాయి.
జరగటమే దయ కాదు.
నిజం చెప్పాలంటే, జరిగిన దానిని గుర్తించడమే దయ.

21.ఓం గానప్రియాయ నమః
భగవద్గుణములను కీర్తించుటయందు ప్రీతి గలవారికి నమస్కారము





22. ఓం నవనీత నటాయ నమః
వెన్నదొంగవలె నటించిన వానికి నమస్కారము.

చూసి నడవాలి


ఇది అలా ఉండాలి - అది ఇలా ఉండాలి
అని అభిలషించడం ప్రగతికి అంతరాయం కాదు.

నేను అభిలషించింది జరిగితేనే నేను తృప్తిగా ఉంటాను
అనుకుంటే మాత్రం అభివృద్ధి ఉండదు సరికదా,
అనుక్షణం అశాంతితో బ్రతకవలసి వస్తుంది.

మనం పొందవలసింది ఏమిటో
మనం కోరుతున్న దేమిటో
స్పష్టంగా తెలిస్తేనే బ్రతుకు భవ్యంగా రాణిస్తుంది.

22. ఓం గానకళాకోవిదాయ నమః
గానకళ యందు నిపుణులైన వారికి నమస్కారము





23. ఓం అనఘాయ నమః
పాపరహితుడైన వానికి నమస్కారము.

కదిల్తేనే కలిసేది

పడుకున్నంత మాత్రాన నిద్ర వస్తుందని చెప్పలేము.
నిద్ర పోవాలనుకుంటే పడుకొనే తీరాలి. నిలబడితే నిద్ర రాదు.

నిద్రించాలని పడుకుంటాము.
నిద్ర వచ్చినంత వరకు పడుకొని ఉంటాము.
నిద్ర వచ్చేస్తుంది.
ఆ తరువాత మన ప్రయత్న మేదీ ఉండదు.
అంతా నిద్ర మహిమే.

ధ్యానం కూడా అంతే.
కూర్చున్నంత మాత్రాన ధ్యానం సాగదు.
కాని,
ధ్యానించాలంటే కూర్చోక తప్పదు. పడుకుంటే ధ్యానం సాగదు.

ధ్యానానికి కూర్చోవాలి. అంతే కాదు.
నియమాలు పాటించాలి.
సమయాలు గుర్తించాలి.

ధ్యానం సాగిందా, ఆ తరువాత
వైభవ మంతా ధ్యానానిదే. మనం నామమాత్రమే.



23. ఓం నాట్యాచార్యాయ నమః
స్వరూపమును సదా గుర్తుంచుకొని సంసారమున మన పాత్ర పోషించు టెట్లో తెలుపు గురుదేవులకు నమస్కారము



24. ఓం నవనీత నవాహారాయ నమః
వెన్నను క్రొత్త ఆహారముగా స్వీకరించిన వానికి నమస్కారము.

హాయిగా!

కర్మ శ్రమతో కూడింది.
అందుకే భారంగా ఉంటుంది.
ప్రేమలో శ్రమ లేదు.
అందుకే తేలికగా ఉంటుంది. తేలిపోతూ ఉంటుంది.

బోధించటం కర్మ కాదు. ప్రేమ.
అది పెట్టెను చూడటం అనే కర్మ కాదు.
అద్దాన్ని చూడట మనే ప్రేమ.
చిరుగాలికి మెల్లగా ఊగే

వరిపైరును చూచినట్లు ఉంటుంది.
మెల్లగా పారే నదితో కలిసి
ఇసుక రేణువులు దొర్లుతున్నంత హాయిగా ఉంటుంది.

అందుకే,
బాధలు తెలియని బోధలు
సునాయాసంగా బాధల్ని దూరతీరాలకు తరలిస్తాయి.



24.ఓం కవయే నమః
క్రాంతిని దర్శించువారికి నమస్కారము



25. ఓం ముచికుంద ప్రసాదకాయ నమః
ముచికుందుని బ్రోచిన వానికి నమస్కారము.

ఉంటే ఏమైంది?

మనకు దగ్గరగా ఏవయినా ఉండొచ్చు.
ఇవి నావి అనే బుద్ధి లేకుంటే చాలు.
మన నుండి ఏవయినా దూరంగా పోవచ్చు.
ఆ పోయినవి నావి అనే బుద్ధి కూడా పోతే
ఇక బ్రతుకులో బాధ లుండవు.

'నావి' అనే బుద్ధి లేనప్పుడు, ఏవి ఉన్నా
అవి బ్రతుకులో ఉంటాయే గాని బుద్ధిలో ఉండవు.

బుద్ధిలో లేనివి బ్రతుకులో ఉండినా, ఊడినా
మనకు ఒరిగే దుండదు. తరిగేది ఉండదు.

25.ఓం నిగమాగమ పారగాయ నమః
వేద వేదాంగముల యందు పారంగతులైన వారికి నమస్కారము





26. ఓం షోడశ స్త్రీ సహస్రేశాయ నమః
పదునారువేల గోపికలకు నాథుడైన వానికి నమస్కారము.

ఫలం నిష్ఫలం

కర్మఫలం ఏదైనా మనం తయారుచేసుకొన్నదే.
ప్రయత్నించి పొందినదే.
కర్మ ప్రయత్నమైతే
ప్రయత్న ఫలితమే కర్మఫలం.

కర్మ తరువాతే ఫలం కనుక
కర్మకు ముందు ఫలం లేదు.
అనుభవం తరువాత ఉండబోదు.

అందుచేత,
కర్మఫలం అశాశ్వతం.
ఇది అర్థమైతే,
ఆ క్షణం నుండే కర్మలలో ఆవేశాలు అంతరిస్తాయి.
అవగాహనలు అందంగా చిగుళ్ళు తొడుగుతాయి.

26.ఓం నిత్యతృప్తాయ నమః
సదా సంతుష్టులై ఉండువారికి నమస్కారము





27. ఓం త్రిభంగినే నమః
మూడు భంగిమల నభినయించుచు
నిలుచున్న వానికి నమస్కారము.

లేని దెక్కడ?

పరమాత్మ దర్శనానికి కళ్ళు మూసుకోవాలా?
కళ్ళు మూసుకుంటేనే జ్ఞానం కలిగేటట్లైతే
ప్రపంచంలో గ్రుడ్డివాళ్ళందరూ జ్ఞానులే అవుతారు.
కనిపించే ప్రపంచమంతా పరమాత్మే.
సాధకుడు కళ్ళు మూసుకొని కూర్చోవచ్చు.
అది
సత్యాన్ని నిర్ధారణ చేసుకొనేందుకే గాని
ప్రపంచాన్ని నిరాకరించేందుకు కాదు.
ప్రపంచంకన్నా వేరుగా పరమాత్మను దర్శించేందుకు అసలే కాదు.

అంతర్బహిశ్చ తత్సర్వం
వ్యాప్య నారాయణ స్థితః

కళ్ళు మూస్తే లోపల పరమాత్మ.
కళ్ళు తెరిస్తే వెలుపల పరమాత్మ.
కళ్ళు మూస్తూ తెరుస్తూ ఉండినా
మధ్యలోనూ అద్దంలా పరమాత్మే.

27.ఓం నిరహంకారాయ నమః
అహంకారము నంతమొందించిన వారికి నమస్కారము





28. ఓం మధురాకృతయే నమః
మధుర భావములను కలిగించే
మోహనా కారునకు నమస్కారము.

ఇప్పుడే

నిన్నటి స్వప్నం ఇప్పుడు లేదు. ఇది గతం.
రేపటి స్వప్నం ఇప్పుడు లేనేలేదు. ఇది భవిష్యత్తు.
ఇప్పుడు కల లేదు. ఇది వర్తమానం.

కలలు లేని కళ
కల్లలు లేని జీవనకళ వర్తమానమే
అనేదే జీవికి దేవుడు పంపే వర్తమానం.

గతించింది తిరిగి రాదు.
వచ్చేది ఏదో వస్తే గాని తెలియదు.
ఉన్నదే ఉన్నది.
ఉనికై ఉన్నది.
ఊరేగుతూ ఉన్నది.
ఉత్సవమూర్తిగా శోభిస్తూ ఉన్నది.

28.ఓం నిరామయాయ నమః
భవరోగ దూరునకు నమస్కారము





29. ఓం శుకవాగమృతాబ్ధీందవే నమః
శుకబ్రహ్మవాక్సుధ యనే సాగరమునకు
చంద్రుడయిన వానికి నమస్కారము.

గుండెలో గురువు

సూర్యుడు ఈ లోకానికి గొప్పవరం.
గురువు శిష్యలోకానికి వరిష్ఠమైన వరం.

గురువును చాలా మంది పట్టుకుంటారు.
చాలా తక్కువ మంది మనస్సులో పెట్టుకుంటారు.
చాలా, చాలా తక్కువ మంది హృదయంలో నిలబెట్టుకుంటారు.
నిలుపుకుంటారు.
హృదయాన్ని గురునిలయంగా మార్చుకుంటారు.
ఆచార్యదేవో భవ.



29.ఓం నిరంజనాయ నమః
నిరంజన స్వరూపునకు నమస్కారము



30. ఓం గోవిందాయ నమః

వేదాంత వాక్యములను గ్రహించుట ద్వారా తెలియబడు వానికి నమస్కారము.

అలా ఉంటే ఎలా?

నిన్ను మారమని నేను చెప్పలేదు.
నేను చెప్పేదేదో నేను చెప్పుకుపోతున్నా.
నీవు మారటం, మారకపోవటం
నీ మీద ఆధారపడిన నీ విషయం.
నీవు హాయిగా, తృప్తిగా ఉంటే మారడ మెందుకు?
ఒకవేళ, నీవు అసంతృప్తిగా ఉండి,
అయినా మారకపోతే ఎలా సుఖపడాలని భావిస్తున్నావు?
ఆలోచించుకో.
నేనేమీ చేయలేదు.
నిన్ను ఆలోచింప చేశాను. అంతే.

30. ఓం నిర్మలాయ నమః

విమల చరితునకు నమస్కారము





31. ఓం యోగినాంపతయే నమః
యోగులకు ప్రభువైనవానికి నమస్కారము.

మరో దారి లేదు

నేర్చినవి ఎన్నో! కాని
అవి బాధల్ని తీర్చినవి కావు. బ్రతుకును తీర్చి దిద్దినవీ కావు.
భయాల్ని బుద్ధికి రుద్దినవే కాని శాంతిని హృదయానికి అద్దినవి కావు.

బుద్ధి వికసనమే గాని హృదయ విలసనము లేదు.
ఉపశమనమే గాని ప్రశమనము కాదు.
ప్రసిద్ధమే గాని సిద్ధి లేనే లేదు.
అన్నీ ప్రలోభాలే గాని నిజలాభాలు లేవు.
ప్రమాదాలే గాని ప్రమోదాలు తెలిసిరావు.

అన్నీ ప్రయత్నాలే.
ప్రయాసలే
అడియాసలే.

మనం తయారుచేసుకున్న పురాకృత రహదారి పైనే
విధాత నిర్ణయాల శకటం పయనిస్తోంది.

అది సాగేదే గాని ఆగేది కాదు.
ఆ రాత తుడిపితే పోయేది కాదు.
కడిగితే కనిపించకపోదు.

దానిని తుడిపే శక్తి మనకు లేదు.
చెడిపే యుక్తి మనకు తెలిసిరాదు.
అందుకే,
పరమాత్మ చరణకమలాలను ఆశ్రయించాలి.



31. ఓం నిర్గుణాయ నమః
సత్త్వరజస్తమో గుణముల కతీతులైన వారికి నమస్కారము



32. ఓం వత్సవాటచరాయ నమః

గోశాలయందు చరించువానికి నమస్కారము.

అది వద్దు - ఇదే ముద్దు

ఉన్నాయి ఎన్నో ప్రపంచంలో కొనేందుకు.
ఉన్నది నిజానికి పరమాత్మ ఒక్కడే కనుగొనేందుకు.

కొన్న వెన్నడూ తీర్చవు బ్రతుకులో కరువు.
ఉన్న వెన్నుడే జీవు లందరికి కల్పతరువు.

సౌకర్యాలు ప్రాప్తిస్తాయి పుష్కలంగా ఉంటే సిరి.
సుఖాలు కావాలంటే హృదయంలో నిలవాలి హరి.

ధనం కనికరిస్తే ఎవరైనా పొందగలరు ఔషధం.
దైవం కనికరిస్తేనే ఎవరికైనా ఇలలో ఆయుర్దాయం.

ఎన్ని ఉన్నా లేదేదో అనేదే మనిషిలో ఏకైక కామం.
ఏదీ అవసరం లేదని తృప్తి నిచ్చేదే మహిలో నామం.

32. ఓం నిత్యాయ నమః

ఎల్లప్పుడు ఉండువారికి నమస్కారము





33. ఓం అనంతాయ నమః
అనంతుడైన వానికి నమస్కారము.

అభయం

నేను ఎవరికీ భయపడను అన్నంత మాత్రాన
మనిషి అభయస్థితిలో ఉన్నాడని అర్థం కాదు
టెర్రరిస్టులు కూడా ఎవ్వరికీ భయపడరు. చావుకు కూడా.
అంతమాత్రాన వారు అభయమూర్తులు అవుతారా?

నీవు భీతి చెందకుండా ఉండటమే కాదు.
పరులు కూడా నిన్ను చూసి భీతి చెందకుండా ఉండాలి.

భీతి చెందితే, ఇక ఆ తరువాత
పాముకు, తేలుకు, పులికి, మనకు భేదమేముంది?

పువ్వులాగ నిర్భయంగా నవ్వగలిగితే
మేఘంలాగ హాయిగా చరించగలిగితే
నదిలా చల్లగా ఉండగలిగితే
గాలిలా మెల్లగా వీచగలిగితే
అప్పుడే మనం అభయమూర్తులం.

33. ఓం నిరుపమాన ప్రబోధకాయ నమః
సాటిలేని ప్రబోధకునకు నమస్కారము





34. ఓం ధేనుకాసుర భంజనాయ నమః
ధేనుకాసురుని వధించిన వానికి నమస్కారము.

అప్పుడే సార్థకం

మనం ఓడిపోవాలని
భగవంతుడు మనల్ని సృష్టించలేదు.

గెలవాలనే పట్టుదలను పోగొట్టుకొని
గెలుపును ఓటమిగా మనం మార్చుకుంటున్నాం.

అర్థం కాని దానిని ఆచరించడం సాధ్యపడదు.
అర్థమైతే ఆచరించకుండా ఉండలేము.
ఆచరించినపుడే అర్థమైనదని భావము.

దారి తెలిసినవాడు దారి తప్పగలడా?
అపశ్రుతులన్నీ సంగీతం రాని వారివే.

జ్ఞానానికి మించిన పవిత్ర వస్తువు లేనే లేదు.
స్పష్టత కన్నా అందమైనది, అద్భుతమైనది జగత్తులో ఉండదు.



34. ఓం నిరాకారాయ నమః
రూపమునకు అతీతులైన వారికి నమస్కారము



35. ఓం తృణీకృత తృణావర్తాయ నమః
తృణావర్తుడనే రాక్షసుని తృణప్రాయంగా సంహరించిన వానికి నమస్కారము.

మరచిపోవద్దు

ఆనందపరచే అండ చేరినపుడు
ఆనందించవద్దని నేను చెప్పడం లేదు.
వాటిని నీ వద్దకు చేర్చినది పరమేశ్వరుడే
అనే సత్యాన్ని మరచిపోవద్దు అంటున్నాను.

తృప్తి చెందే క్షణాలు ఎప్పుడు నీకు లభించినా
హాయిని అనుభవించవద్దు అని నేను బోధించను.
నీవు సుఖించేందుకు కాలాన్ని అనుకూలంగా మలచిన
పరమాత్మను విస్మరించవద్దు అంటున్నాను.

అతణ్ణి చక్కగా అర్థం చేసుకొనేందుకు
అంతకు మించిన పవిత్రకాలం మరొకటి ఉండదు అంటున్నాను.



35. ఓం నిరంతర శ్రీకృష్ణ పాదపంకజ భ్రమరాయ నమః
నిరంతరం శ్రీకృష్ణుని పాదపద్మముల యందలి ఆనంద మకరందమును గ్రోలుచుండు తుమ్మెదకు వందనము



36. ఓం యమళార్జున భంజనాయ నమః
యమళార్జున వృక్షములను కూల్చినవానికి నమస్కారము.

మానేయ్

సుఖపడటానికి కోరికలు తీర నవసరం లేదు
అనేది అర్థమైతే, ఆ తరువాత,
కోరికలు ఉంటే కష్టం కాదు.
కోరికలు తీరకుంటే నష్టమూ లేదు.
కోరే శక్తి భగవంతుడు మనిషికి ప్రసాదించిన వరం.
ఆ శక్తితోనే భగవంతుణ్ణి కూడా కోరుకుంటున్నాం.
కోరితే తప్పులేదు.
కోరింది రాలేదని విలపిస్తే అర్థం లేదు.

36. ఓం మనోవాగతీతాయ నమః
మనస్సునకు, వాక్కునకు అందని వారికి నమస్కారము





37. ఓం ఉత్తాల తాలభేత్రే నమః
ఎత్తైన తాటి వృక్షములను ఛేదించిన వానికి నమస్కారము.

ఆలోచించుకో

మనం ఏ పని చేసినా ప్రేమతో చేయాలి.
జ్ఞానంతో చేయాలి.
ప్రేమకార్యాలలో తృప్తి ఉంటుంది. ఆనందం ఉంటుంది. శాంతి ఉంటుంది.
సుఖశాంతులు పనులకు సంబంధించినవి కావు.
మనిషికి సంబంధించినవి.
వేడుకలలో ఏడ్చేవారిని మనం చూడటం లేదా?
సంబరాలలో సంతాపం చెందేవారు ఎందరులేరు?
నీవు హాయిగా ఉంటేనే పరిసరాలు, పనులు, కాలాలు తృప్తి నిస్తాయి.
సుఖం నీకు సంబంధించినదే గాని బాహ్యానికి సంబంధించినది కాదు.

37. ఓం మాతృముక్తి ప్రదాయకాయ నమః
మాతృదేవికి ముక్తినిచ్చిన వారికి నమస్కారము





38. ఓం తమాలశ్యామలాకృతయే నమః
తమాలవృక్షముల వలె శ్యామలవర్ణము
గలవానికి నమస్కారము.

అనివార్యం

ప్రపంచంలో లేదా మన జీవితంలో
ఎన్నో జరుగుతున్నాయి.
జరిగినవి మనకు ఇష్టం లేకపోవచ్చు.
కాని, జరుగవలసినవియే జరిగాయి.
ఏది జరిగినా దాని వెనుక నియతి ఉంది. ధర్మం ఉంది.
కార్యం తెలుస్తూ, కారణం తెలియనపుడు
మనస్సు నలిగిపోతుంది. ఘర్షణ క్రుంగదీస్తుంది.
జరిగినవి, జరిగేవి, జరుగుతున్నవి ఘర్షణలకు కారణాలు కాలేవు.
వాటిని అంగీకరించలేని అశక్తత ఘర్షణకు శ్రీకారం చుడుతుంది.

38. ఓం భావాతీతాయ నమః
ఆలోచనకు అందని వారికి నమస్కారము





39. ఓం గోప గోపీశ్వరాయ నమః
గోపగోపీ జనమునకు ప్రభువైన వానికి నమస్కారము.

మాట ఎవరిది? బాట ఎవరిది?

నాకు మనసు ఉంది. నేను మనసును కాను.
ఈ వాస్తవం వంటపట్టని కారణంగా
మనోకల్పితాలు నావిగా, నేనుగా తెలిసి,
మనస్సు ఏమిటో నేను ఏమిటో అర్థం కాకుండా పోతోంది.

మనోబాధల్ని మనం మోయలేక
మన మెవరో మనస్సుకు అర్థంకాక
అంతా అయోమయంగా ఉంది.

ఏది ఏమైనా,
మనస్సు మన అధీనంలో ఉండి సహకరిస్తే
పరాధీనం కాకుండా ఉపకరిస్తే లోటు ఉండదు.

మనస్సు చేతికి మనం చిక్కితే
ఆ తరువాత బ్రతుకు బుసకొట్టినా, నసపెట్టినా
దానికి కారణం మనస్సే అయి ఉంటుంది.



39. ఓం గుణాతీతాయ నమః
త్రిగుణముల కందని నిర్మలునకు నమస్కారము



40. ఓం యోగినే నమః
యోగీశ్వరునకు నమస్కారము.

ఇవి లేవు - అవి ఉండవు

ఆరడుగుల మనిషిని అర్థగంటలో
ఆసుపత్రిపాలు చేయడానికి
అరటిపండు తొక్క చాలు.
ఇదంతా తొక్క వైభవం కాదు.
ప్రారబ్ధం యొక్క ప్రభావము.
తెలియని ప్రారబ్ధం వెంట నడచినప్పుదు
ఏదైనా, ఎప్పుడైనా, ఎలాగైనా జరుగవచ్చు.
ఆగతే స్వాగతం కుర్యాత్
వచ్చేవాటికి ఆహ్వానం పలకడమే మన కార్యం.
గచ్ఛంతం న నివారయేత్
పోయేవాటిని అడ్డుకోకుండా
నిలిచి అవలోకించడమే మన క్రమం.



40. ఓం పరిపూర్ణాయ నమః
పరిపూర్ణ స్వరూపునకు నమస్కారము



41. ఓం కోటి సూర్యసమప్రభాయ నమః
కోటి సూర్యులకు సమమైన కాంతిగల వానికి నమస్కారము

అటు - ఇటు

ప్రమిదలోని నూనె
వత్తిని పట్టుకొని పైకి పోయిందంటే
జ్యోతిగా ప్రకాశిస్తుంది.
ఒలికిపోయి క్రిందికి జారిందంటే
మలినపడిపోతుంది.
మనస్సుకు ఈ రెండు దారులూ ఉన్నాయి.
వినియోగం తెలిస్తే శని నిలవడు.
తెలియనివాడు ఎవడైనా ముని కాలేడు.

41. ఓం పరిశుద్ధాయ నమః
నిష్కళంకునకు నమస్కారము





42. ఓం ఇలాపతయే నమః
ధరణీనాథునకు నమస్కారము.

జ్ఞానదీపం

ప్రేమించే శక్తి మనకు లేదా?
ప్రేమకు అనుకూలమైన కాలం అవసరమా?
ప్రదేశం అవసరమా?
ప్రేమకు దేశకాలాలు అడ్డుగా లేవు.
ఎప్పుడైనా, ఎక్కడైనా వ్యక్తం కావచ్చు.
కాని,
ఏ క్షణమైనా, ఏచోటైనా వ్యక్తమయ్యే ప్రేమ
ఏ క్షణమూ, ఎక్కడా వ్యక్తం కావటం లేదు.
ఎందుకని?
శక్తి లేక కాదు. వ్యక్తం చేసే యుక్తి లేక. స్ఫూర్తి లేక.
మరి, ఏం చేయాలి?
ప్రేమించటానికి ప్రేమ కార్యాలను చేయటంకన్నా ఏమి చేయగలం?
మాటలాడినా, ఆటలాడినా
ఇచ్చినా, పుచ్చుకున్నా,
సాయం చేసినా, ఓదార్చి న్యాయం చేసినా
చెరువులో జలం చలించినట్లు చిత్తంలో ప్రేమ కదుల్తూ ఉండాలి.
వెలుగుతూ ఉంటేనే దీపం.
ప్రేమిస్తూ ఉంటేనే జ్ఞానం.



42. ఓం పరితోష ప్రదాయినే నమః
ఆనందము ననుగ్రహించు వారికి నమస్కారము



43. ఓం పరంజ్యోతిషే నమః
ప్రకాశైక స్వరూపమునకు నమస్కారము.

అటు కూడా చూడాలి

పరస్పర భేదాలు తలెత్తినపుడు
దోషమంతా ప్రక్కవారిదే అన్నట్లు
ఆలోచించడం ఎక్కువమందికి అలవాటు.
ఇక్కడే గుండె భారం పెరిగేది.

వారు చెప్పే దానిలో కూడా వాస్తవ ముందేమో
ఆలోచిస్తాం అని భావించి,
ఆ కోణంలో విశ్లేషణ మొదలుపెడితే,
ఆ క్షణంలోనే,
మనస్సు తేలికపడటమే గాక,
మనకంటూ కొన్ని అవగాహనా ద్వారాలు
నాటకీయంగా తెరుచుకుంటాయి.

43. ఓం పరాత్పరాయ నమః
శ్రేష్ఠులకు శ్రేష్ఠులైన వారికి నమస్కారము





44. ఓం యాదవేంద్రాయ నమః
యాదవకుల నాయకునకు నమస్కారము.

సాగిపో - జారిపోకు

పైకి ఎక్కలేకపోవచ్చు.
క్రిందికి దిగకుండా చూసుకోవాలి.
కనీసం ఉన్నచోట ఉండేందుకైనా
దృఢప్రయత్నం చేయాలి.

ఉన్నచోట నిశ్చలంగా ఉంటే, మున్ముందు
ప్రయత్నించి పైకిపోయే అవకాశం ఉంటుంది.

అవగాహన లోపించి
రెండుమెట్లు క్రిందికి దిగితే
ఆ తరువాత,
ఎక్కాలి అనుకున్నప్పుడు
ముందుగా ఎక్కవలసినవి దిగిన మెట్లే.
అవి దాటితేనే ప్రగతి.

44. ఓం పవిత్రాత్మనే నమః
జ్ఞానపూతులైన వారికి నమస్కారము





45. ఓం యదూద్వహాయ నమః
యదువంశము నకు శిరోభూషణమైన వానికి నమస్కారము.

వారికే సాధ్యం

ఆవు బ్రతుకుతుంది. అర్చన చేయలేదు.
కుక్కలు బ్రతుకుతాయి. సంకీర్తనం చేయలేవు.
దున్నలు బ్రతుకుతాయి. ధ్యానం చేయలేవు.
జంతువులు బ్రతుకుతాయి. జపాలు చేయలేవు.
మనుష్యులు కూడా బ్రతుకుతారు.
జంతువులు చేయలేనివి ఎన్నో చేస్తారు.

మాయలు చేస్తారు. మోసాలు చేస్తారు.
నేరాలు చేస్తారు. హత్యలు చేస్తారు.
దోపిడీలు చేస్తారు. దగాలు చేస్తారు.
పాపం చేస్తారు. మరెన్నో చేస్తారు.

పవిత్రకార్యాలు జంతువులు చేయలేవు.
పాపకార్యాలు దుష్టులే చేయగలరు.

పుణ్యకార్యాలు, దైవకార్యాలు, యజ్ఞకార్యాలు పావనాత్ములే చేయగలరు.
పరమాత్మ కృపకు నోచుకున్న పుణ్యాత్ములే చేయగలరు.



45. ఓం ప్రణవ స్వరూపాయ నమః
ఓంకార రూపునకు నమస్కారము



46. ఓం వనమాలినే నమః
తులసిమాలను ధరించిన వానికి నమస్కారము.

మనసు - మహిమ

కూలబడేది మన కృషి
కూర్చోబెట్టేది అతని కృప.


ఏడుపు మనది
వేడుక అతనిది

ఆగ్రహాలు, నిగ్రహాలు మనవి
అనుగ్రహాలన్నీ అతనివి

మనస్సు మనది
మహిమ అతనిది.

భక్తి బరువుల్ని లెక్కచేయదు.
బాధల్ని పట్టించుకోదు.
పూర్ణభక్తిలో వెలితి ఉండదు.
పూర్ణజ్ఞానంలో వెలుగు చెదరదు.

46. ఓం తీర్థ స్వరూపాయ నమః
తరింప జేయు వారికి నమస్కారము





47. ఓం పీతవాససే నమః
పీతాంబరమును ధరించిన వానికి నమస్కారము.

చెత్త - సత్తా

ఏదో చేయాలి అంటుంది ఎద
చేసేందుకు ఏదయినా ఉంటే గదా!

అంతా ఇచ్చేయాలి అంటుంది మనసు
ఇచ్చేందుకు ఏది మిగిలుందో ఎవరికి తెలుసు?

పిలవకపోయినా వస్తుంది కోపం.
అదేదో పిలిచినట్లు వస్తుంది పాపం.

చేసిన పనులే. చూసిన రుచులే.
నేడు క్రొత్త. రేపు పాత.
మరునాడు ఉండదు పత్తా.

చెత్తే కదా ఇప్పటికి చూసిందంతా
పరమాత్మే అంతటికి నిజమైన సత్తా.

47.ఓం త్రిమూర్త్యాత్మక శక్తి స్వరూపాయ నమః
బ్రహ్మ విష్ణు మహేశ్వరుల శక్తినే తన స్వరూపముగా గల వారికి నమస్కారము





48. ఓం పారిజాతాపహారకాయ నమః
పారిజాతవృక్షమును స్వర్గము నుండి
తెచ్చిన వానికి నమస్కారము.

ఉంటనే ఊరేగేది

భక్తి అనేది
సంతలో దొరికే వస్తువు కాదు.
కూలికి ఏడ్చేది కాదు.
మెప్పుకు కులికేది కాదు.
గొప్పకు పలికేది కాదు.

హృదయంలో ప్రేమ లేనపుడు
భక్తి కార్యాలలో ఆవేశంతో ప్రవేశించినా
ఈత రానివాడు బావిలో దూకినట్లే ఉంటుంది.

కడుపులో లేనిది కౌగిలించుకుంటే వస్తుందా? అనేది సామెత.
మెదడుకు మేత.



48. ఓం ప్రకాశైక స్వరూపాయ నమః
తేజోవంతునకు నమస్కారము



49. ఓం గోవర్ధనా చలోద్ధర్త్రే నమః
గోవర్ధనగిరి నెత్తిన వానికి నమస్కారము.

జయాపజయాలు

కాలాన్ని మనం వినియోగించుకుంటే
వైకుంఠం మన దగ్గరకు వస్తుంది.
మనల్ని కాలం వినియోగించుకుంటే
వల్లకాటికి మనం దగ్గరవుతాము.
కాల హరణమా?
కాలంలో స్మరణమా?
అది తేలితే, ఆ తరువాత
మునగడమా? తేలడమా? అనేది తేటతెల్ల మవుతుంది.



49. ఓం మంగళ స్వరూపాయ నమః
శుభకరునకు నమస్కారము



50. ఓం గోపాలాయ నమః
గోవులను కాపాడిన వానికి నమస్కారము.

చేయగలిగింది

మన భావాలకు ప్రాధాన్యత నిస్తూ ఆలోచించినంత కాలం
మనకు ఇతరుల దోషాలే కనిపిస్తాయి.

ఇతరుల ఆలోచనా దృక్పథం నుండి మనం కొద్దిగా ఆలోచించగలిగితే
వెంటనే మన దోషాలు మనకు స్పష్టంగా కనిపిస్తాయి.

ఇతరుల దోషాలు మనకు కనిపించినా
వాటిని నివారించే శక్తి మనకు లేదు.

కాని,
మనలో దోషాలు ఉన్నట్లు మనకు తెలిస్తే,
వాటిని పోగొట్టుకోవాలని మనం భావిస్తే,
పోగొట్టుకొనే అవకాశం మాత్రం మన చేతిలోనే ఉంది.

50. ఓం మంత్ర స్వరూపాయ నమః
అనేక మంత్రములచే స్తుతించబడు దివ్యరూపము తామే
యైనవారికి నమస్కారము





51. ఓం సర్వపాలకాయ నమః
సర్వజీవులను పాలించు వానికి నమస్కారము.

ప్రేమ కార్యం

నది ఎంత దూరం పయనించినా,
ప్రయాణంలో ఎంతగా శ్రమించినా,
సముద్రంలో కలిసేముందు
ప్రశాంతంగా, నిర్మలంగా, హాయిగా చలిస్తూ ఉంటుంది.

నిత్యజీవితంలో
మనం ఎంతగా అలసిపోయినా,
బాధల్లో తదేకంగా కలిసిపోయినా,
పూజాగదిలో ప్రవేశించేటప్పుడు
ధ్యానాసనం వద్దకు చేరేటప్పుడు
సాగరుని కలిసే నదీమ తల్లిలాగా
స్వచ్ఛంగా
ప్రసన్నంగా
ప్రశాంతంగా ఉండాలి.

సాధన కర్మే అయినా,
సాధనలో ప్రేమే గాని కర్మ లేదు.



51. ఓం ఆనంద స్వరూపాయ నమః
ఆనందమే తమ స్వరూపముగ గల వారికి నమస్కారము



52. ఓం అజాయ నమః
పుట్టుకలేనివానికి నమస్కారము.

ఏం జరుగుతుందో!

మనం శ్వాసలు విడుస్తూ ఉంటాము.
తిరిగి పీల్చుకుంటామనే నమ్మకంతోనే.
శ్వాసను తిరిగి పీల్చుకోలేమనే సంశయ ముంటే
అసలు శ్వాసను విడిచిపెట్టమేమో!

శ్వాసలను విడవటమే గాక
తిరిగి పీల్చుకుంటాము అనేది
మన అనుభవంలో ఉంది.

అంతమాత్రాన
విడిచిన శ్వాసను
తిరిగి పీల్చుకోలేకపోవచ్చు అనే
సందేహానికి అవకాశం లేకపోలేదు.

ఈ సత్యం తెలిస్తే,
శ్వాసల మీద కాకుండా
శ్వాసలను కదిలించేవానిపై విశ్వాసం పెరుగుతుంది.
క్రమేపీ ఆ విశ్వాసమే భక్తియై శోభిస్తుంది.




52. ఓం ఆత్మస్వరూపాయ నమః
సకల జీవులలో 'నేను'గా తెలియు స్వరూపము తానే యైనవారికి నమస్కారము



53. ఓం నిరంజనాయ నమః
కల్మషరహితునకు నమస్కారము.

కృషితో నాస్తి దుర్భిక్షం

'నేను తృప్తి లేనివాణ్ణి' అని భావించటం చేత
తృప్తి చెందేందుకు ఏవేవో పొందాలని ప్రయత్నిస్తున్నాం. పరితపిస్తూ ఉన్నాం.
మనమే తృప్తి అనే పరమసత్యం అర్థమైతే,
తృప్తి పడేందుకు లేనివి రావాలని ఆశించము.
ఉన్నవి పోవాలని ప్రయత్నించము.
తృప్తిని పొందాలనే తపన మనలో ఉండొచ్చు.
'నేనే తృప్తి' అనే జ్ఞానం మనకు లేదు.
కనుక
మన సమస్య లన్నిటికీ ప్రబలకారణం జ్ఞానం లేకపోవడమే.
ప్రయత్నం చేయాలేగాని
పోని అజ్ఞానము లేదు.
రాని జ్ఞానమూ లేదు.
అందుచేతనే
ఆచార్యవాన్ పురుషో వేద
ఆచార్యుని పొందినవానికి జ్ఞానం లభిస్తుంది అన్నది వేదం.



53. ఓం అక్షయ రూపాయ నమః
నశింపు లేనివారికి నమస్కారము



54. ఓం కామజనకాయ నమః
మన్మథునికి తండ్రియైన వానికి నమస్కారము.

నిర్మల సరోవరం

ఏదో ఒకటి లేదా కొన్ని జీవితంలో సాధించగనే
విశ్వ విజేత అయినట్లు మనిషి ఊగిపోతూ ఉంటాడు.
మన జీవితంలో
ఆశించి పొందలేకపోయినవి
శ్రమించి సాధించలేక పోయినవి - ఎన్నో
కాసేపు విచారించుకుంటే,
మన వైఫల్యాలకు మించినవి మరొకరికి ఉండవేమో అనిపిస్తుంది.
ఏదో పొందటం
మరేదో పొందలేకపోవటం విజయం కాదు.
ఏది పొందినా
పొందలేకపోయినా
అశాంతిని పొందని మనస్సును కలిగియున్నవారే విశ్వవిజేతలు.
అమూల్యమైన, అద్భుతమైన అక్షయ సంపదకు యజమానులు.



54. ఓం చిన్మయ రూపాయ నమః
జ్ఞానమయునకు నమస్కారము



55. ఓం కంజలోచనాయ నమః
కమలదళ నేత్రునకు నమస్కారము.

అతనికే సాధ్యం

బ్రతుకు బండి తన దారిన అది సాగిపోతుంది.
జీవించినంత కాలం ఇక జీవించకపోవచ్చు.

ఇక చేయబోయేది కూడా
గతంలో చేసిందే. చూసిందే.

ఈ తనువు ప్రపంచంలో ఎంతదాకా ఉంటుందో!
ఉన్నంతకాలం ఎన్ని రోగాలు పరామర్శిస్తాయో!
ఎన్ని కష్టాలు కుదిపేస్తాయో!
గుడ్డను పిండినట్లు గుండెను పిండే దుర్భర దుఃఖాలు జీవితంలో ఎన్ని ప్రాప్తిస్తాయో!

నా భుక్తం క్షీయతే కర్మ
కల్పకోటి శతైరపి

గతంలో చేసిన పనుల ఫలితాలు
ఏదో ఒకనాడు అనుభవించక తప్పదు.

ఎండిన చెరువును ఎన్ని మంచు తుంపరులు నింపుతాయి?
ఆ పనిని ఘనంగా మేఘుడే చేయగలడు.

ఎండిన బ్రతుకుల్ని పండించే కార్యమును
శ్యాముడే చేయగలడు. నీలమేఘశ్యాముడే చేయగలడు.



55. ఓం శాంతరూపాయ నమః
ప్రశాంత స్వరూపునకు నమస్కారము



56. ఓం మధుఘ్నే నమః
'మధు' అనెడి రాక్షసుని వధించిన వానికి నమస్కారము.

ఆశాదీపం

మనిషిగా పుట్టి చేసిన మంచి ఏమీ లేదు.
నియమాలు లేవు. నిష్ఠలు లేవు.
దానము లేదు. ధర్మము లేదు.
పుణ్యం లేదు. పురుషార్థం లేదు.
అయినా
పరమాత్మ కరుణిస్తాడనే గొప్ప నమ్మక ముంది.
ఆ విశ్వాసమే ఉద్ధరించమని భగవంతుని ప్రార్థించేలా చేసింది.
నారుపోసినవాడు నీరుపోయకపోడు - అనేది సామెతే అయినా, దానిపై పూర్ణ విశ్వాసం ఉంచినవారు ఎందరో ఈ సత్యాన్ని అనుభవంలో దర్శించారు.

56. ఓం తత్త్వమసీత్యాది వాక్య లక్ష్యార్థ రూపాయ నమః
'తత్త్వమసి' (నీవే అది) మొదలగు శ్రుతివాక్యముల నిజ అర్థమే తన స్వరూపముగ గలవారికి నమస్కారము





57. ఓం మధురానాథాయ నమః
మధురానగరికి ప్రభువైన వానికి నమస్కారము.

భక్తి అజేయం

భక్తి ఎన్నడూ ఓడిపోదు.
భక్తు డెన్నడూ ఓటమి నెరుగడు.
మేఘజలం వర్షించి భూమిని చేరుతుంది.
భక్తుని హృదయం ధ్యానించి పరమాత్మను చేరుతుంది.
రూపాలన్నీ తనవే.
నామాలన్నీ అతనివే.

భగవాన్!
నీ నామాలే నేను నేర్చిన ఓనమాలు.
నీ రూపాలే నాకు తెలిసిన ఆనవాలు.
మతి ఇలా ఉందని నాకు తెలుసు.
గతి ఎలా ఉంటుందో నీకే తెలుసు.



57. ఓం బ్రహ్మానందమయాయ నమః
బ్రహ్మానందముతో నిండియుండు వారికి నమస్కారము



58. ఓం ద్వారకా నాయకాయ నమః
ద్వారకా పట్టణమునకు ప్రభువైన వానికి నమస్కారము.

దోషం చూడకు దయామయా!

భగవాన్!
ప్రపంచంలో అందరూ
పాపాల పుట్టలే
దోషాల కట్టలే
మోసాల గుట్టలే
మోహాల బుట్టలే

మావన్నీ పాపాలే
మేమందరము నీ పాపలే.

దీపంలో వత్తి వేసి వెలిగించకపోయినా
కళ్ళల్లో వత్తు లేసుకొని ఎదురుచూస్తున్నాం.
పాపాలు పట్టించుకోకు.
పాపలను నెట్టేయకు.
కనుపాపవై గుట్టుగా మాలో నిలిచిపో.
పసిపాపలైన మాలో రమణీయంగా వెలిగిపో.



58. ఓం దయామయ దేహాయ నమః
కరుణ ననుగ్రహించు ఆలయము వంటి శరీరము గలవారికి నమస్కారము



59. ఓం బలినే నమః
దైవబలంతో శోభించు వానికి నమస్కారము.

కల్పనా జగత్తు

సాధకా! సాగిపో!
మనసును చూడు. కాని,
అందులో ఉండేది ప్రపంచమే నని మరువకు.

ప్రపంచాన్ని చూడు. కాని,
అది కేవలం మనసు సృష్టించిందేనని తెలుసుకో.

మనస్సు వలన ప్రపంచం ఏర్పడిందా! లేక,
ప్రపంచం ఉండటం చేత మనసు తెలుసుకొంటూ ఉందా?
ఏదీ కాదేమో!
ప్రపంచం రూపమా? అయితే, మనస్సు నామం.
ఈ నామరూపాలతోనే ప్రపంచం బుద్ధిలో భాసిస్తూ ఉంది.
లేదా, బుద్ధి ప్రపంచంలో భావిస్తూ ఉంది.

నామరూపాలు మిథ్య అని తేలితే రెండూ లేవు.
రెండు లేనిచోట ఒకటి ఉన్నట్లేనా? కాదు. రెండుకాని స్థితి ఉంది.
అదే అద్వైతము.
వాచారంభణ శ్రుతి వినిపించిన "మృత్తికేత్యేవ సత్యమ్".



59.ఓం ప్రేమ నిలయాయ నమః
ప్రేమకు నిలయమైన వారికి నమస్కారము



60. ఓం బృందావనాంత సంచారిణే నమః
బృందావన మంతటా సంచరించు వానికి నమస్కారము.

నీవే దిక్కు

పద్మనేత్రా! మేము పండితులం కాము.
చూచి తరించేవారమే గాని
చవిచూసి ఆస్వాదించలేము.

ఆడే పెదవులు నీవి
కాపాడే పదవులు నీవి

మా బ్రతుకులు దారుణం
మా ప్రారబ్ధమే కారణం.
తిమిరంలో తారాడే మేము తీరాన్ని చేరగలమా?
తాపంతో ఉన్నామేగాని పాపం తెలిసినవాళ్ళం కాము.

మేము పాపులం కాము. నీ పాపలం.
నీ గుడి ముంగిట కాపులం.

పాలిచ్చే భారము నీదే.
మము పాలించే బాధ్యతా నీదే.

మాకున్నది ఆర్ద్రతే.
రక్తే. అనురక్తే. భక్తే. పరాభక్తే.



60. ఓం జితేంద్రియాయ నమః
సకలేంద్రియములను జయించిన వారికి నమస్కారము



61. ఓం తులసీదామ భూషణాయ నమః
తులసీపత్ర మాలికచే అలంకృతుడైన వానికి నమస్కారము.

అమ్మా! ఆకలి

తల్లిని చుట్టేది బిడ్డ
బిడ్డకు పెట్టేది తల్లి
అడిగి పెట్టించుకొని నమలాలి గాని,
సంకోచంతో నీళ్ళు నమలడ మెందుకు?

అడిగి తింటే లేదు తప్పు.
అడుక్కుతింటేనే చాలా తప్పు.

అడిగేది అమ్మనే కదూ!
అమ్మల గన్న అమ్మనే కదూ!
జగన్మాతనే కదూ!

ఇక సిగ్గెందుకు?
తగ్గకుండా అడిగివేయడమే.
సిగ్గు సిగ్గు పడేలా గీపెట్టడమే.
ముక్తిని ప్రసాదించమని మొరపెట్టుకోవడమే.



61. ఓం అభినవ శంకరాచార్యాయ నమః
నేటి సమాజమున ఆదిశంకరుల వలె
ధర్మోద్ధరణ గావించుచున్న వారికి నమస్కారము



62. ఓం శమంతక మణేర్హర్త్రే నమః
శమంతకమణిని అపహరించిన వానికి నమస్కారము.

చేస్తేనే ఏద్దైనా

అన్నీ సరిపడితే సాధన ప్రారంభిస్తాము
అనుకోవటం సరియైన అవగాహన కాదు.

ముందు ప్రారంభిస్తే,
మున్ముందు అన్నీ సరిపడతాయి.

గుట్టం కదిల్తే చాలు.
బండి తనంతట తానే కదుల్తుంది.

చేస్తేనే ఏద్దైనా చూసేది
రుచి చూడాలన్నా వంట చేస్తేనే

పల్లవించని ఆలాపనలు
ఆచరణ లేని ఆలోచనలు
జడత్వాన్ని పెంచుతాయి.
జీవత్వాన్ని పెంపొందిస్తాయి.
దైవత్వాన్ని మరుగున పడేస్తాయి.



62. ఓం అద్వైత వివేకాయ నమః
అద్వైత జ్ఞానము ననుభూతిగ గల వారికి నమస్కారము



63. ఓం నరనారాయణాత్మకాయ నమః
నరనారాయణుల స్వరూపమైన వానికి నమస్కారము.

అయ్యో! పాపం!

ఎవరు ఎలా ఉన్నారు? ఎలా ఉంటున్నారు?
అనేది మనకు అర్థమవుతూ ఉంది.

ఎవరైనా కానివ్వండి.
వారు అలా ఉండటానికి కారణాలు ఉన్నాయా? లేదా? అనేదే ముఖ్యం.
అది మంచి కారణమా? చెడు కారణమా? అనేది అసందర్భం.

కారణాలు ఉండి కార్యాలు వ్యక్తమయ్యే టప్పుడు
కారణాలు అర్థమైతే, ఆ తరువాత కార్యాలు ఇబ్బంది పెట్టవు.

కార్యాలు మనకు అవరోధంగా ఉన్నా,
వాటిని ఆచరించే వ్యక్తులు మనకు అర్థమై ఉంటారు కనుక
కార్యాల ప్రభావం మన మనస్సుపై పెద్దగా ఉండదు.

అంతేకాదు.
అట్టి కార్యాలను ఆచరించిన వారిపై
మనకు ద్వేషభావం పొడసూపదు సరిగదా,
వల్లమాలిన సానుభూతి పుట్టుకొస్తుంది.

63. ఓం అద్వితీయాయ నమః
రెండవది లేని ఏక స్వరూపము తానే యైన వారికి నమస్కారము





64. ఓం కుబ్జా కృష్ణాంబరధరాయ నమః
కుబ్జను గ్రహించి అనుగ్రహించిన వానికి నమస్కారము.

రెండే మార్గాలు

దుఃఖ కారణాల విషయంలో
జాగ్రత్తగా ఉండగలిగితే
ప్రతిక్షణం సుఖిస్తూనే ఉంటాం.

అలాగే,
సుఖ కారణాలను అన్వేషించకుండా
జాగ్రత్తగా మసలుకోగలిగితే
మనమే సుఖమై ఉంటాం.

మొదటిది కర్మయోగం వల్ల ప్రాప్తిస్తుంది.
రెండవది జ్ఞానయోగం వల్ల సంప్రాప్తిస్తుంది.



64. ఓం అవికారాయ నమః
మార్పు లేనివారికి నమస్కారము



65. ఓం మాయినే నమః
మాయను తన అధీనమునందు ఉంచుకొన్న వానికి నమస్కారము.

అందరూ అర్హులే

యదిష్టం తదేవ తస్య వా ధనం

ఎవరికి ఏది ఇష్టమో అది వారికి ధనము.
కాని, ఏ ధనమైనా వ్యయమే. క్షయమే.
జ్ఞానధన మొక్కటే అక్షయధనం.

అక్షయధనానికి అర్హులు ధన్యులు. కృతార్థులు.
అక్షయధనం ఏదో కాదు. మోక్షమే.

మోక్షాన్ని పొందిన ముక్త పురుషులు ధన్యులు.
మోక్షమును కోరే ముముక్షువులు కూడా ధన్యులే.

ఒకరిది సిద్ధావస్థ.
మరొకరిది సాధనావస్థ.

నిన్నటి సాధకులు నేడు సిద్ధులు.
నేటి సాధకులు రేపు సిద్ధపురుషులు.
పవిత్రులు. కృతార్థులు. ధన్యులు.
అట్టి ధన్యాత్ములే ధరణిలో ఆరని దీపాలు.



65. ఓం అశేష జనాకర్షకాయ నమః
సకల జనులను తమ ప్రేమ, జ్ఞానములతో ఆకర్షించు వారికి నమస్కారము



66. ఓం పరమ పురుషాయ నమః
పరాత్పరుడైన పురుషోత్తమునికి నమస్కారము.

నవ్వే పువ్వు

తుమ్మెద ఎటు ఎగిరినా, ఎక్కడ తిరిగినా
పువ్వుపై వాలినపుడే నవ్వుతుంది.

తనకు ఆకలి తీరేది, ఆనందం కలిగేది
పువ్వు ఒడిలోనే. ఆ గుడిలోనే.

అరవిందము ఎవరికైనా అందంగానే అగుపిస్తుంది.

కాని,
భ్రమరానికి అందులో అందమే కాదు; ఆనందం కూడా లభిస్తుంది.
ఎందుకో తెలుసా?
అరవిందంలో దాగిన మకరందమును జుర్రే భాగ్యం తనకే ఉంది గనుక.

పరమాత్మ పాదారవిందము సర్వులకు ఆధారము.
కాని, భక్తులైన భ్రమరాలకు ఆధారస్థానమే కాదు; ఆనంద నిలయము కూడా.

66. ఓం అచిన్త్యాయ నమః
యోచించలేని స్వరూపము తానే యైన వారికి నమస్కారము





67. ఓం ముష్టికాసుర చాణూర మల్ల యుద్ధ విశారదాయ నమః

మల్లయుద్ధ నిపుణులైన చాణూర ముష్టికులను జయించిన వానికి నమస్కారము.

గురు వైభవం

చీమ చిన్నదే అయినా దాని నోట్లో చక్కెర ఉంటుంది.
ఏనుగు పెద్దది అయినా దాని తల మీద అంతా దుమ్మే.

తలకు ఎక్కించుకోవలసింది ఏమీ లేకపోయినా, తలగడల రూపంలో
చెత్త నింపిన పుస్తకాలను కొందరు రచయితలు
సమాజ భుజానికి ఎత్తుతూ ఉంటే,
కొండ అద్దమందు కొంచెమై ఉండదా అన్నట్లు, విశిష్టమైన
పెద్దపెద్ద విషయాలను తక్కువ మాటల్లో పొదిగి అందించగలిగే నేర్పు
నూటికో, కోటికో ఏ ఒక్కరికో ఉంటుంది. వారే గురువులు. ఆచార్యులు.

తండ్రి మనస్సు తల్లికి రాదు.
తల్లి హృదయం తండ్రికి ఉండదు.
కాని, ఈ రెండూ ఆచార్యునికి ఉంటాయి.

ఆచార్య దేవోభవ!

గురువు నీకు దేవుడు అగుగాక! అని ఆశీర్వదించింది వేదమాత.
అట్టి ఆచార్యులే ధర్మాన్ని, ప్రేమను కలబోసి జ్ఞానాన్ని అందిస్తారు.

67. ఓం అనర్గళ భాషణశీలాయ నమః

గంగా ప్రవాహము వలె బోధ ననుగ్రహించు వారికి నమస్కారము





68. ఓం సంసారవైరిణే నమః
సంసారమనెడి అజ్ఞానమునకు శత్రువైన వానికి నమస్కారము.

బోధలు - బాధలు

వేదాంతము ప్రచార సాధనం కాదు.
ప్రబోధ విషయం. ప్రమాణం.
ఈ విషయం అర్థం గాని వారి ప్రసంగాల్లో
ప్రబోధ సుధకన్నా ప్రచార వ్యథ అధికంగా ఉంటుంది.

ప్రబోధము ప్రభావితం చేస్తుంది.
జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది.

ప్రచారము విచారానికి నోచుకోని సమాచారంతో
బుర్రను నింపేస్తుంది.
బ్రతుకును చిందరవందరగా చింపేస్తుంది.
ప్రగతిని చంపేస్తుంది.

68. ఓం ఆత్మస్థితాయ నమః
ఆత్మయందే స్థిరుడై ఉండువారికి నమస్కారము





69. ఓం కంసారయే నమః

కంసుని అంతమొందించిన వానికి నమస్కారము.

వేదమే నాదం

అద్యంతము లున్న ఈ ప్రపంచంలో
అసంతృప్తే అందరికీ ఆహారము.
నిరాశే పానీయము.
నిస్సహాయతే నిద్ర.
ఆశలే స్వప్నాలు. చింతలే ఆభరణాలు.
భయశోకాదులే సంపాదనలు.


వెగటు లేని వెలుగు వెతికినా కనిపించదు.
ప్రతి విషయానికి ఏదో విధమైన వైరుధ్యము ఉంటుంది.
ఎంతటివారైనా కొందరికి నచ్చకుండా ఉంటారు.
ఏ వస్తువైనా అందరికీ ఉపకరించదు.

అందరికీ అనుకూలమైన చోటు ఎక్కడో
ఇప్పటికి ఎవ్వరికీ అంతుపట్టలేదు.

అందరినీ సంతృప్తి పరచగలిగేది ఏదో
దానికొరకే అందరూ ప్రయత్నిస్తున్నా,
ఎవ్వరూ కృతకృత్యులు కాలేకపోతున్నారు.

అన్ని ద్వారాలు మూతబడిపోయాయి. మూతబడి ఉన్నాయి.
ఒకే ఒక్క ద్వారం మిగిలి ఉంది. వెలిగిపోతోంది.
అదే కైవల్యద్వారము. శ్రుతిమందిర ప్రాంగణం.

శృతి రేవ శరణ మితి



69. ఓం ఆదిమధ్యాంత రహితాయ నమః

మొదలు, నడుమ, తుది అనునవి లేని వారికి నమస్కారము



70. ఓం మురారయే నమః
మురను అంతమొందించిన వానికి నమస్కారము.

ఎవరికి కావాలి?

తన ఆత్మనే అంతటా దర్శించే ఆచార్యునికి
ఇతరులను అహేతుకంగా ప్రేమించడం సాధారణమైన విషయము.

గురువు తమపై చూపే అపారప్రేమకు
తన అర్హతే కారణమని
తన ధనమే మూలమని,
తన హోదాయే నిమిత్తమని భావించడం
శిష్యుని అయోగ్యతకు ప్రతిరూపము.
ఒక విధంగా చెప్పాలంటే, అది అతని దురదృష్టము.

ఇతరుల అవసరం తనకు ఉందని భావించేవాడు
ఎన్నడూ గురువు కాలేడు.

ఆత్మజ్ఞానంలో అవసరాలు లేవు.
అభిరుచులు ఉండవు.

ఈ సత్యము సామాన్యుల స్థాయికి దిగదు.
భయశోకాదులు ఆత్మజ్ఞానంలో అనూహ్యములు.
ఆత్మజ్ఞాని యైన గురువు విషయంలో అసంగతములు.

70. ఓం ఆనంద ప్రదాత్రే నమః
దివ్యానందము ననుగ్రహించు వారికి నమస్కారము





71. ఓం నారకాంతకాయ నమః
నరకాసురుని అంతమొందించిన వానికి నమస్కారము.

చైతన్య శక్తి

ఏం జరుగుతుందో? ఏ ప్రమాదం ముంచుకొస్తుందో?
ఎవరు దూరమవుతారో? రేపు ఎలా ఉంటుందో?
ఈ భయమంతా ఎక్కడ నుండి వచ్చింది? ఆలోచన నుండే కదూ!

ఏది జరగాలో అది జరుగుతుంది. అంతా సవ్యంగానే ఉంటుంది.
అన్నిటికీ ఈ ప్రపంచంలో అన్నిటితో సంబంధం ఉంది.
దూరభారాలు లేనేలేవు.
ఇప్పుడు భయముందా?
ఈ అభయస్థితి దేని నుండి వచ్చింది? ఆలోచన నుండే కదూ!

ఆలోచనలో ఇంత శక్తి ఉందా?
ఆ శక్తి ఎవరిది? అది ఎలా ఉంది?
ఇదే నిజమైన అభయస్థానము.

ఆ స్థానము ఏదో కాదు. నీవే. నేనే.
నీలోని నేనే. నాలోని నువ్వే.

త్వమేవాహం.

71. ఓం ఆర్షధర్మ దీపికాధారిణే నమః
సత్యసందేశాల వెలుగులు విరజిమ్మే సనాతన
ధర్మదీపికను ధరించినవారికి నమస్కారము





72. ఓం అనాది బ్రహ్మచారిణే నమః

ఆదిలేని బ్రహ్మచారికి నమస్కారము.

మరో దృష్టి లేదు

బిడ్డ తల్లి కొరకు రోదిస్తాడే గాని
ఆమె కట్టుకున్నది పట్టు చీరేనా?
ఆమె పెట్టుకున్నది పసిడి నగలేనా? అని చూడదు.

అమ్మను తలచుకొంటూ బిడ్డ విలపిస్తాడు.
అమ్మ ముఖం కనిపించగానే ఏడవడం మానేస్తాడు.
అమ్మ ముఖం తప్ప అన్ని ముఖాలు ఏడిపించేందుకే ఉన్నాయి.

ప్రపంచాన్ని చూస్తే మోహం జనిస్తుంది.
ప్రపంచంలో ఏ ముఖమైనా వాంఛలను రేపేందుకే ఉంది.

జగజ్జనని మోము కమల సౌందర్యంతో గోచరిస్తుంది.
అది జ్ఞానవైభవము.
కనుక, మోహమును తుడిచేస్తుంది. మోక్షానికి దారిని సుగమం చేస్తుంది.

72. ఓం జన్మకర్మ నివారిణే నమః

జనన మరణ సంసార చక్రమును నిరోధించు వారికి నమస్కారము





73. ఓం కృష్ణా వ్యసన కర్శకాయ నమః
ద్రౌపది బాధలను తొలగించిన వానికి నమస్కారము.

నిత్య చైతన్యం

కాల ప్రభంజన కల్లోలంలో
కలవరింతలు మామూలే.
కన్ను తెరిస్తే, కలముగిస్తే,
కళలన్నీ ఇలలో కల్లలే.

రోదన తెలియని సాధనలోనే
బాధలు కనుమరు గవుతాయి.

యాతన తెలియని చేతనలోనే
నూతన వెలుగులు ఉంటాయి.

ఉలి దెబ్బలకు ఉల్లము చెదరక
రాయి రూపమై వెలిసింది.

వెతలు చిత్తమును చిత్తు చేయగా
చెత్త దూరమైపోతుంది.
చిత్తే నీవుగా ఉంటుంది.

73. ఓం బ్రహ్మచారిణే నమః
నిరంతరం బ్రహ్మమునందే రమించు వారికి నమస్కారము





74. ఓం శిశుపాల శిరశ్ఛేత్రే నమః
శిశుపాలుని మస్తకమును ఛేదించిన వానికి నమస్కారము.

చీకటి వెలుగులు

ఏదో ఏదో చేసేవాడు
ఏదో చెయ్యమని చెప్పేవాడు
ఏది చేయాలో, ఏ ఆలోచన చెయ్యాలో
చెప్పేవాడు ప్రచారకుడు.

ఎలా చెయ్యాలో చెప్పేవాడు
ఎందుకు చెయ్యాలో చెప్పేవాడు ప్రబోధకుడు.

ప్రచారము కర్మ.
ప్రబోధము జ్ఞానం.

జ్ఞానం లేని కర్మ తిమిరమే.
జ్ఞానం కలిగితే కర్మ తేజమే.



74. ఓం బుద్ధి సాక్షిణే నమః
బుద్ధికి వెనుక ఉండి నిర్లిప్తులై వీక్షించు వారికి నమస్కారము



75. ఓం దుర్యోధనకులాంతకాయ నమః
దుర్యోధనుని కులమును అంత మొందించిన వానికి నమస్కారము.

ధర్మ మేవ జయతే

ధర్మరూపంలో ఉన్నది దైవమే.
ధర్మరూపంలో కాకుండా,
పరమేశ్వరుని మరో రూపంలో ఎలా గుర్తించగలం?

'భగవాన్!
ధర్మరూపంలో శోభించే నిన్ను
గుర్తించే అవకాశాన్ని నాకివ్వు' అని ప్రార్థించాలి.

ధర్మబద్ధంగా మనం జీవించగలిగితే,
పరమాత్మ మనకు అవకాశం ఇచ్చినట్లే.
మనల్ని ఆశీర్వదించినట్లే.
అలా ధర్మంగా జీవిస్తూ,
దివ్యంగా శోభించేవారే భక్తులు.

75. ఓం సుమకోమల భావ సంపన్నాయ నమః
పువ్వుల వంటి సున్నిత భావములను సంపదగ గలవారికి నమస్కారము





76. ఓం విదురాక్రూర వరదాయ నమః
విదురునకు, అక్రూరునకు వరముల నొసగిన వానికి నమస్కారము.

ఉండమన్నా ఉండవు

పోయే కాలం వచ్చినప్పుడు
నిలుపుకోవాలి అనే ప్రతి ప్రయత్నంలో
కొన్ని జారిపోతూనే ఉంటాయి.

తల వెంట్రుకలు ఊడిపోయే క్షణాన
ఏ నూనె రాసినా
ఎంత మెల్లిగా రాసినా
కుప్పగా వెంట్రుకలు ఊడుతూనే ఉంటాయి.

అపరిష్కృతాలకు ఆవేదన చెంది
సాధించేది ఏమీ ఉండదు కనుక
అర్థం చేసుకొని జీవించటమే బుద్ధికి ఆరోగ్యము.

76. ఓం లలిత కళాకోవిదే నమః
జీవన కళను తెలిపే లలితకళల యందు నిష్ణాతులైన వారికి నమస్కారము





77. ఓం విశ్వరూప ప్రదర్శకాయ నమః
విశ్వరూపమును ప్రదర్శించిన వానికి నమస్కారము.

పోతేనే వస్తుంది

ఉన్నది ఒకే కుర్చీ అయినప్పుడు
ఇంటికి వచ్చిన అతిథిని 'రండి - కూర్చోండి' అని
కుర్చీలోనే కూర్చొని నీవు ఆహ్వానిస్తే, అతిథి గతి ఏం కావాలి?

అతడు కూర్చోవాలి అనేదే నీ భావమైతే,
ఆ మాత్రం గౌరవాభిమానాలు అతనిపై నీకుంటే,
నీవు లేచి నిలబడటంకన్నా మరో మార్గం లేనే లేదు.

నీవు లేస్తేనే తాను కూర్చుంటాడు.
పలికితే పనులు జరుగవు.
కదిల్తేనే జరుగుతాయి.

హృదయపీఠంపై పరమేశ్వరుడు ఆసీనుడు కావాలంటే,
ముందుగా తిష్ఠవేసి యున్న 'అహం' హృదయం నుండి తొలగాలి.

అహం భావన తొలగినపుడే
అహం స్వరూపం దివ్యంగా భాసిస్తుంది.

77. ఓం గజారోహణ కృతే నమః
గజారోహణ పురస్కారము పొందిన వారికి నమస్కారము





78. ఓం సత్యవాచే నమః
సత్యవచనములు గలవానికి నమస్కారము.

చిద్విలాసుని చిరునామా

మనస్సులో మరొకదాని కొరకు కాకుండా
కేవలం భగవంతుని కొరకే ఆలోచన కదిలితే
అదే భక్తి భావన. భావనా భక్తి.

అట్టి పవిత్ర భావనలో ఎవరో లేరు, ఏదో లేదు.
పరమాత్మే ఉన్నాడు. ఉన్నదంతా తానై ఉన్నాడు.

ఒక ప్రదేశానికి మరొక కారణంగా వెళ్ళకుండా
కేవలం భక్తి కొరకే వెళ్తే,
ఆ ప్రదేశం ఏదైనా సరే, ఆలయమే అవుతుంది.
అక్కడ జరిగేదంతా అర్చనే అవుతుంది.

78. ఓం భవసాగర సేతు కృతే నమః
సంసార సాగరమును దాటుటకు వంతెన
గట్టిన వారికి నమస్కారము





79. ఓం సత్యసంకల్పాయ నమః
సత్యమైన సంకల్పములు గలవానికి నమస్కారము.

జ్ఞానంలోనే మాయం

చెప్పినంత మాత్రాన
ఒకరు చూసింది మరొకరు చూడలేకపోవచ్చు.
చెప్పిన వ్యక్తిపై విశ్వాసముంటే
అతను చెప్పింది నిజమని నమ్మవచ్చు.
కాని, నమ్మకాలు అజ్ఞానాన్ని వమ్ము చేయలేవు.

సూర్యోదయం జరగటం లేదని, సూర్యుడు స్వయంప్రకాశమే నని, సదా ప్రకాశరూపుడే నని ఒకరికి అర్థమయ్యేలాగ మరొకరు చెప్పగలిగితే, ఆ తరువాత, విన్నవాడికి సూర్యోదయం గోచరించినా, ఉదయాస్తమయాలు సూర్యునికి లేవు అనే అతని జ్ఞానాన్ని ఎవ్వరూ వమ్ము చేయలేరు.

మాయ - మిథ్య
మనసు - మహిమ - లాంటివి ఉన్నా,
అర్థమైనపుడు లేనివిగానే ఉంటాయి.



79. ఓం దోష దూరీకృతే నమః
గుణదోషములను క్షాళన మొనరించు వారికి నమస్కారము



80. ఓం సత్యభామారతాయ నమః
సత్యభామ యందు ప్రత్యేక ప్రేమ గలవానికి నమస్కారము.

పండ్లు రెండు. రసం ఒక్కటే

ఒక అద్దమును మరి ఒక అద్దము ప్రతిబింబించి నపుడు
వాటిలో దేనిని ఏది ప్రతిబింబిస్తున్నది?

స్వామిజీ! మీరు సాధువులని మేము నమస్కరిస్తే,
ఆశీర్వదించకుండా మాకు ప్రతి నమస్కారం చేస్తారేమిటి?
అని భక్తులు పలికినపుడు,

అద్దమే నా ముందు అద్దంలా నిలుస్తుంది.
బ్రతుకుకు అద్దం పడుతుంది. అర్థం చెబుతుంది.

80. ఓం కాంస్య ఘంటారవ భాషిణే నమః
కంచువలె మ్రోగు కంఠము గల వారికి నమస్కారము





81. ఓం జయినే నమః

జయము గలవానికి నమస్కారము.

ఉన్నది ఊడేది కాదు

ఏడుపంటే ఎవరికైనా బాధే. ఆ ప్రస్తావనే మనిషి సహించలేడు.
అందుకే ధాన్యం కొలిచేవాడు 'ఆరున్నొకటి' అంటాడే కాని ఏడు అనడు.
'ఏడు' అంటే ఏడ్వవలసి వస్తుందని భయపడిపోతాడు.

చెట్టెక్కినవాడు దిగాలంటే
ఎక్కిన చెట్టు మీద నుండి దిగాలే గాని
మరొక చెట్టు మీద నుండి కాదు.

ఏడుపులో ఉన్నవాడు కూడా దానినుండే విముక్తిని పొందాలి.
దానిని విస్మరించి కాదు.
అందుకే నేమో,
'ఏడు'ను చూచి ఏడుపును స్మృతికి తెచ్చుకొని
భీతి చెందే మానవుని ఉద్ధరించేందుకు
భగవద్గీతలో శ్రీకృష్ణుడు 'ఏడు'నే ఆలంబనంగా తీసుకొని బోధించాడు.

ఏడవ అధ్యాయం - ఏడవ శ్లోకంలో
ఏడుపును ఏడిపించేశాడు.
వేడుకను వెలిగించేశాడు.
మత్తః పరతరం నాన్య త్కించిదస్తి ధనంజయ

అర్జునా! నాకంటే శ్రేష్ఠమైనది మరొకటి లేనేలేదు అన్నాడు.
అందుకే ఏడును ఎన్నుకున్నాడేమో!
ఏమైనా ఏడుకొండలవాడు కదా!
ఎత్తైన దేవుడు. ఆయనకైనా ఎత్తైనవాడు (పరతరం) ఎవదుంటాడు?



81. ఓం దుస్సంగ ద్వేషిణే నమః

దుర్జన, దుష్టభావ సాంగత్యమును సహించని వారికి
నమస్కారము



82. ఓం సుభద్రాపూర్వజాయ నమః
సుభద్రాదేవి కంటే ముందు పుట్టిన వానికి నమస్కారము.

ఎవరికి వారే

మేము ప్రాణ స్నేహితులం. మేమిరువురము ఒక్కటే.
దేహాలు రెండైనా ప్రాణం ఒక్కటే అని స్నేహితులు ఆవేశాన్ని ఒలకబోస్తూ ఉంటారు.
ఇది నిజమా! కానేకాదు. ఆ విషయం వారికే తెలుసు.
అందుకనే, ఒకరి భుజాలపై మరొకరు చేతులు పడేసి ఉంటారు.

ఆయన శరీరం ఆయనదే. ఇతని దేహం ఇతనిదే.
ఎక్కడికైనా కలిసి వెళ్ళామని వారు అంటే,
"అది సాధ్యం కాదు. అతనితో కలిసి నువ్వు పోలేవు. నీతో అతను రాలేదు" అని చావు కబురు.

కలిసి ఉండొచ్చు. కలిసి పోలేము. పోయినా కలవలేము.
ఇది అర్థమైతే, భుజాలపైకి బరువు లెక్కవు. గుండెలు బండబారవు.

82. ఓం సత్సంగ ప్రియాయ నమః
సత్సాంగత్యము నిష్టపడు వారికి నమస్కారము





83. ఓం విష్ణవే నమః
సర్వవ్యాపకుడైన వానికి నమస్కారము.

ఉండిపోకు - నిండిపో

జీవితం శాశ్వతం కాదు.
శ్మశానం పెద్ద దూరంలో లేదు.
దూరమైనా, దగ్గరైనా కాలానికి కరుణ లేదు.
కాలాలు, దూరాలు కనికరించవు. ఏదో ఓ క్షణాన
కర్కశంగా ఊడ్చుకొని పోతాయి కాటికి.

దాచింది దగా చేయకపోదు.
మూసిందంతా మోసం చేసేదే.
పెరుగుట విరుగుట కొరకే.
కూడికల తరువాత తీసివేతలే.
సంయోగాలన్నీ వియోగాలే.
వినోదాలన్నీ విలాపాలే.
సంబరాలన్నీ సంతాపాలే.

ఎంత ఊదినా కామానికి తృప్తి లేదు.
ఎంత చేదినా లోభానికి భర్తీ తెలియదు.
ఎంత ఖర్చయినా క్రోధానికి నష్టం అర్థం కాదు.
చక్రాన్ని త్రిప్పాలనే ఆశ అందరికీ ఉంటుంది.
తిరిగే చక్రాన్ని ఆపాలనే ఆతృత ఎందరికుంటుంది?

ప్రపంచ జల్లెడలో
కాలం నిర్వహించే వడపోతలో
అందరూ కారిపోయేవారే.
అలాగని ప్రశ్నలతో పారిపోకూడదు.
జవాబులు జేబులో పెట్టుకొని జారిపోవాలి.



83. ఓం భక్త హితాయ నమః
భక్తులకు శ్రేయము నొనగూర్చు వారికి నమస్కారము



84. ఓం భీష్మముక్తి ప్రదాయకాయ నమః
భీష్మునకు మోక్షమును ప్రసాదించిన వానికి నమస్కారము.

అంతిమ సంబరం

గువ్వ గగనంలో విహరిస్తుంది.
పక్షి ఎంత ఎత్తులో ఎగురుతున్నా,
ప్రాణం పోయే సమయాన
క్రిందికి దిగి ప్రాణం వదలదు.
ఎక్కడ ఎగురుతూ ఉందో, అక్కడే ప్రాణాన్ని వదిలేసి
క్రింద పడుతుంది.
కాయలు కోయాలని చెట్టెక్కినా
చెట్టుపైనే ప్రాణం పోతే
కాయలకు బదులుగా కాయాన్ని క్రింద పడేసిన వాళ్ళు చాలా మంది ఉన్నారు.

ఎక్కేది దిగేందుకే.
కాని, పైకి ఎక్కి దిగకుండానే ప్రాణాలు
అలా అలా పైకి పోయిన వాళ్ళు ఎందరో ఉన్నారు.

చెట్లెక్కే వాళ్ళు కొందరు. మేడ లెక్కేవాళ్ళు కొందరు.
కొండలెక్కే వాళ్ళు కొందరు. కార్లు ఎక్కేవాళ్ళు కొందరు.
రైళ్ళెక్కే వాళ్ళు కొందరు. విమానా లెక్కేవాళ్ళు కొందరు.
గుఱ్ఱాలెక్కేవాళ్ళు కొందరు. ఏనుగు లెక్కేవాళ్ళు కొందరు.

ఎవరు దేని నెక్కుతారో తెలియదు. కాని,
ఒకనాడు అందరూ నలుగురి భుజాల మీద ఎక్కి పోవలసిన వాళ్ళే.
చిన్న చిన్న చెట్లెక్కడం నేర్చుకొని
ఒకేసారి అమాంతం కొబ్బరిచెట్ల నెక్కినట్లు
అవి ఇవి ఎక్కి ఎక్కి
చివరగా పాడె ఎక్కి పడుకోవడమే. ఊరేగడమే.
మనం లేకుండా జరిగే మన చివరి ఊరేగింపు అదే.



84. ఓం భక్త సులభాయ నమః
భక్తులకు అత్యంత సన్నిహితులైన వారికి నమస్కారము



85. ఓం జగద్గురవే నమః
జగద్గురువునకు నమస్కారము.

కొన్నవి - కనుగొన్నవి

విత్తం వినియోగానికే.
ధనంతో కొన్ని కొనగలం. అలాగని అన్నీ కొనలేము.

వెన్నెలకు ఖరీదెంత?
వర్షానికి విలువెంత?
సూర్యుని వెలుగుకు మూల్యమెంత?
పువ్వుల్లో వాసనకు ధర ఎంత?

అంతమాత్రాన డబ్బుకు విలువలేదని కాదు.
ధనానికి విలువ ఉంది. ధనంలో విలువ లేదు.
ఇది అర్థమైతే,
ధనం దైవంలా శోభిస్తుందే గాని పిశాచంలా పీడించదు.

85. ఓం శిష్య వత్సలాయ నమః
తండ్రివలె శిష్యులను కాచి, కాపాడు వారికి నమస్కారము





86. ఓం జగన్నాథాయ నమః
జగన్నాయకునకు నమస్కారము.

అప్పుడే జరిగేది

పట్టుమని పది నిముషాలు కళ్ళు మూసి
ధ్యానం చేయగలం అని భావించటం తేలికే.
చేస్తే తెలుస్తుంది. అది భావించినంత తేలిక కాదని.

మనం దైవధ్యానం చెయ్యలేము.
ఈశ్వర భక్తిని సాగించలేము.

ఈశ్వరుడు అవసరంగా మారితే
చేసేవన్నీ ఈశ్వర ధ్యానా లవుతాయి
చూసేవన్నీ ఈశ్వర రూపా లవుతాయి
వినేవన్నీ దైవ విషయాలై ఉంటాయి.

ఈశ్వరుడు అవసరంగా ఎప్పుడు మారుతాడు?
ప్రస్తుతం మనం అవసరాలని భావించినవి
అవసరాలు కావని తెలుసుకున్నప్పుడు

86. ఓం శిష్య సన్మార్గ శాసకాయ నమః
నిజధామమును చేరు మార్గమును శిష్యులకు చూపు
వారికి నమస్కారము





87. ఓం వేణునాద విశారదాయ నమః
వేణుగానముతో సమస్తమును సమ్మోహింప జేయువానికి నమస్కారము.

ఎంత మాత్రం?

సుఖం వస్తే మనిషి అనుభవిస్తాడు.
కాని, ఎప్పుడొస్తుందో తెలియదు.
అసలు వస్తుందో రాదో కూడా తెలియదు.

అందుకే, చాతకపక్షి వర్షానికి
ఎదురు చూచినట్లు, ప్రతి మనిషి సుఖానికి నిరీక్షిస్తున్నాడు.

వర్షం పడితే చాతకపక్షి త్రాగుతుంది.
వర్షాన్ని కురిపించే శక్తి తనకు లేదు.

పెద్ద పెద్ద కోరికలతో మనస్సులు ఎగిరిపడవచ్చు.
వల్లమాలిన వాంఛలను మనుషులు ఊహించుకోవచ్చు.
కాని,
ఒక చిన్న కోర్కెను కూడా తీర్చుకొనే శక్తి
తనకు లేదని మనిషికి తెలియదు. అదే ప్రతి ఒక్కరికీ అర్థం కావాలి.

87. ఓం శిష్యాణాం కల్పవృక్షాయ నమః
శిష్యులకు హితమైన దంతయు ఇచ్చు కల్పతరువైన వారికి నమస్కారము





88. ఓం వృషభాసుర విధ్వంసినే నమః
వృషభుడనే రాక్షసుని వధించిన వానికి నమస్కారము.

ఓడేం దెవరు?

వేగంగా నడవలేకపోవడం లోపం కాదు.
వెనుకంజ వేయడమే దోషం.

ధ్యానయోగి ప్రతి చిన్న విషయాన్ని పట్టించుకోకూడదు.
పట్టింపులు మనసును ఒత్తిడికి గురిచేసి మార్గాన్ని తప్పిస్తాయి.

వచ్చేవి వస్తుంటాయి.
పోయేవి పోతుంటాయి.

వాటి విలువ ఏమిటో, ఉపయోగ మెంతో
అంచనా వేయడం అలవాటు చేసుకోవాలి.

దాగుడుమూతలు ఆడే పిల్లలు
దొరికిపోయినపుడు కూడా నవ్వుతారు.

ఓటమిలో మనం కూడా అలాగే ఉండాలి.
అప్పుడే ధ్యానం నిరాటంకంగా సాగుతుంది.



88. ఓం అజ్ఞాన తిమిర నాశకాయ నమః
అజ్ఞాన చీకట్లను చీల్చువారికి నమస్కారము



89. ఓం బాణాసుర ఖరాంతకాయ నమః
బాణాసురుడనే వానిని సంహరించిన వానికి నమస్కారము

వీలు కాదు

ఇతరుల ఆలోచనలతో కలిసి కొంతసేపు
ఆలోచించడానికి మించిన సేవ ఈ ప్రపంచంలో మరొకటి లేదు.

ఈ సత్యాన్ని కష్టపడి అయినా అర్థం చేసుకోవాలి.
దీనిని అంగీకరించడానికి అనుభవ మొక్కటే సరిపోదు.
సౌజన్యంతో కూడిన జీవితం కావాలి.

మనం యంత్రాలు కాము
మనస్సున్న మనుష్యులం.

పదిమందితో కలిసి జీవిస్తున్నవాళ్ళం.
సభ్య సమాజంలో చరిస్తున్నవాళ్ళం.

ఇతరులను కష్టాలలో, కన్నీటిలో ముంచి
మనం సుఖాల్లో, పన్నీటిలో తేలి ఆడలేము.



89. ఓం ద్వంద్వ నాశకాయ నమః
సాపేక్షికములైన ద్వంద్వములను నాశము
చేయువారికి నమస్కారము



90. ఓం యుధిష్ఠిర ప్రతిష్ఠాత్రే నమః
ధర్మజుని వైభవమునకు కారణమైనవానికి నమస్కారము.

వెతలే వెలుగులు

ఇది బాధల ప్రపంచం.
స్వార్థ సర్పాలు తిరుగుతున్న ప్రదేశం.
ఇక్కడ బాధలు తప్పవు.
సమస్యలు తప్పవు.
కాని, ఆ సమస్యలే పరమాత్మను చూపే జ్యోతులైనపుడు
సమస్యలు కూడా స్నేహితులే. బాధలన్నీ బంధువులే.
ప్రపంచంలో ఉండేవి అలా ఉండనీ.
పరమాత్మలో నీవు ప్రశాంతంగా ఉండిపో.

90. ఓం తాపత్రయ వినాశకాయ నమః
అధిభూత, అధిదైవ, అధ్యాత్మ తాపములను
హరించు వారికి నమస్కారము





91. ఓం బర్హీ బర్హావతంసకాయ నమః
నెమలి పింఛమును అభరణముగా గల వానికి నమస్కారము.

సమదృష్టి

పరమాత్మ నీ భావాలను గ్రహిస్తాడు. నీ మొర వింటాడు.
నీ మాటల్ని ప్రేమతో వింటాడు. ఎలా పిలిచినా పలుకుతాడు.

పరమాత్మ మెచ్చుకొనే టంతటి గొప్ప భాష మనవద్ద లేదు.
భావస్ఫూర్తితో మనం ఏది పలికినా అది పరమాత్మకు ప్రియంగా ఉంటుంది.

నీ పలుకుల్లో వ్యాకరణ దోషాలున్నాయని భగవంతుడు నీకు దూరంగా పోడు.
మన వ్యాకరణ వైభవాన్ని చూసి మనల్ని గుర్తించటానికి పరమాత్మ మేష్టారు కాదు.

పరమాత్మకు కావలసింది భాషావేత్తలు కారు. భక్తులు.
భక్తులలో భాషా వైభవం తొంగి చూడవచ్చు.
భాష ఉన్న వారందరు భక్తులు కాలేరు.

91. ఓం కామ వినాశకాయ నమః
కామమును దగ్ధమొనర్చు వారికి వందనము





92. ఓం పార్థసారథయే నమః
పార్థునికి సారథియైన వానికి నమస్కారము.

సమర్పణం

పువ్వు అందంగా అగుపిస్తుంది.
భావనతో దానిని భగవంతునికి నివేదిస్తే
అది ఆరాధనగా మారుతుంది.

వేద్యం తెలిసివస్తే ఏది ఇచ్చినా
నైవేద్య మవుతుంది.

ఫలపుష్పాలే కావు
పత్రతోయాదులు కూడా నైవేద్యాలే.

అవి కూడా అందకపోతే
ఉన్న రెండు చేతుల్ని ఏకం చేసి
నమః అనడమే.
అది కూడా అర్పణమే. సమర్పణమే.

92. ఓం శిష్య హృదిస్థ సంశయ విచ్ఛేదకాయ నమః
శిష్యుల హృదయముల యందలి సందేహములను
నశింపజేయువారికి నమస్కారము





93. ఓం అవ్యక్తాయ నమః
వ్యక్తము గాని దివ్యదేహునకు నమస్కారము.

జీవన కళ

అలసిన బాటసారికి చెట్టు నీడ నిస్తుంది.
పూలు రాల్చి అతిథిని గౌరవిస్తుంది.
పండ్లు పెట్టి విందు చేస్తుంది.

ఒకరికి సహకరించేందుకు ఉంది బ్రతుకు అంటుంది తరువు.
ఇదియే తరువు నేర్పిన బ్రతుకు తెరువు.

స్వామిజీ! మీ బోధలతో మా బాధలను
మరచిపోయాం. హాయిగా ఉన్నాం.
అని కొందరు పలికినపుడు

పిలిచినట్లు వచ్చి చెట్లు నా కళ్ళ ముందు నిలుస్తాయి.
మెల్లగా ఊగుతాయి. నా హృదయాన్ని చల్లగా ఊపుతాయి.



93. ఓం భేదభావ దృష్టిదోష నివారకాయ నమః
సత్యము అందని దశలో తెలిసే భేద భావ
చత్వారమును తొలగించువారికి నమస్కారము



94. ఓం గీతామృత మహోదధయే నమః
భగవద్గీత యనెడి అమృతమునకు
సాగరము వంటి వానికి నమస్కారము.

వేదాంత వెన్నెల

ముసిరేది చీకటి
విరిసేది వెన్నెల

విడిపోతే ఎడబాటు
విడి ఉంటే ఎదపోటు.

రెండు గాని ఒకటి ఉండనీ.
ప్రభూ! అదే నా ఎదిలో నిండనీ.

గాలితో కలిసి గంతులేయాలని ఉంది.
ఆకాశంతో కలిసి ఆడుకోవాలని ఉంది.

నీటితో చెయ్యి పట్టుకొని నడవాలని ఉంది.
భూమిని ప్రేమతో కౌగిలించుకోవాలని ఉంది.

నిప్పులా నింగి కేగాలని ఉంది.
వర్షంలా క్రిందపడి జారాలని ఉంది.

ప్రభూ! ఇదంతా ఉంది.
నాలో ఉంది. నేనుగా ఉంది.

94. ఓం భయశోక హరాయ నమః
భేదభావ జన్యములైన భయమును, శోకమును
తొలగించువారికి నమస్కారము





95. ఓం కాళీయఫణి మాణిక్య రంజిత శ్రీ పదాంబుజాయ నమః

కాళీయుని పడగలపై గల మాణిక్యము లచే అలంకరించబడిన చరణ కమలములు గల వానికి నమస్కారము.

అదేమిటా? అని

అందాన్ని ఆస్వాదించాలని నేను ఉత్సాహపడటం లేదు.
బంధాలను త్రెంచుకోవాలని నేను ప్రయత్నించటం లేదు.
బంధాన్ని అర్థం చేసుకొనే ప్రయత్నంలో నేనున్నాను.
అర్థంగాని దానిని తొలగించే ప్రయత్నం నేను చేయను.

మబ్బును కరిగించాలని, నీటిని మేఘం కార్చేస్తూ ఉంటే చూడాలని, లేదా ఆ జలాలలో తడవాలని నేను ఉబలాటపడటం లేదు.

కదిలే మబ్బు ఎందుకు కరగటం లేదో అడిగి మరీ తెలుసుకుంటున్నాను.
మబ్బుకు చేసిన జబ్బేమిటో పరీక్షించి మరీ చూస్తున్నాను.
వీచే గాలికి కదిలే మబ్బుకు కయ్య మెందుకొచ్చిందో సూక్ష్మంగా విశ్లేషిస్తున్నాను.



95. ఓం భవసాగర తారకాయ నమః

సంసార సముద్రమును దాటించు వారికి నమస్కారము



96. ఓం దామోదరాయ నమః
దామోదరునకు నమస్కారము.

పూర్ణానందం

పువ్వుకు అందాన్నిచ్చింది నేనే.
అందుకే నన్ను చూస్తే పువ్వు సిగ్గు తొడుగుతుంది.


నదికి నవ్వు నేర్పింది నేనే.
అందుకే, నేను దగ్గరయితే గలగల మంటుంది.

గాలికి పాటలు నేర్పింది నేనే.
కాకపోతే, నన్ను చూసి గాలి ఈల వేస్తే
నా గుండె ఎందుకు గోల చేస్తుంది?

ఇవన్నీ అందరికీ అర్థమయ్యేవి కావు.
కొన్ని అలా కాకపోవడమే మంచిది.

అర్థం కావడం - అర్థం కాకపోవడం
రెండూ ఒకటేనని అర్థమయ్యే దశలో
ఇక అర్థం(సగం) ఉండదు.
అంతా పరమార్థమే.

96. ఓం కరుణామృత సాగరాయ నమః
కారుణ్యమనే అమృతముతో నిండిన
సాగరము వంటి వారికి నమస్కారము





97. ఓం యజ్ఞభోక్త్రే నమః
యజ్ఞఫలము ననుభవించు వానికి నమస్కారము.

దారి ఇస్తేనే దగా

గృహం బాధించదు. గృహాసక్తి బాధిస్తుంది.
కాంత కలత పెట్టదు. కాంతాసక్తి కలత పెడుతుంది.
ధనం కలవర పెట్టదు. ధనాసక్తి కలవర పెడుతుంది.

ఏవైనా ఇలాగే ఉంటాయి.
అవకాశం ఇస్తేనే అలజడులు.
అర్థం చేసుకుంటే అన్నీ కదిలే అలలే. కరిగే కలలే.

ఉన్నవాటిని త్యజించటం వైరాగ్యం కాదు.
అవసరం కానివాటిని మనస్సులో ప్రవేశించకుండా
జాగ్రత్త వహించటమే వైరాగ్యము.



97. ఓం యశఃకామ రహితాయ నమః
కీర్తి కాంక్ష నెరుగని వారికి వందనము



98. ఓం దానవేంద్ర వినాశకాయ నమః
రాక్షస నాయకులను వధించిన వానికి నమస్కారము.

ఉంటే ఏమైంది?

సన్మానాలలో ప్రకాశించేవాడు విద్వాంసుడు.
మానావమానాలలో శోభించేవాడు సాధువు.
సాధువు కాగలిగితే బాధలు అర్థం కావు.

విమర్శలు ఎప్పుడూ ఉంటాయి. ఎవరినీ విడువవు.
వాటిని పరామర్శిస్తూ పోతే ప్రగతిని సాధించలేము.

గాలి వీచేవి మాకులు.
గోల చేసేవి కాకులు.

మాకుల్లాగ ఊగిపోనవసరం లేదు.
కాకుల్లాగ ఊరేగ నవసరం లేదు.

హంసలాగ జీవించడమే మన కర్తవ్యం.
పరమహంసలా తరించడమే మన ధర్మం.

98. ఓం మనోభీష్ట ఫలప్రదాయ నమః
మన అంతర్యములోని వెలితిని తామే గ్రహించి తొలగించు వారికి నమస్కారము





99. ఓం నారాయణాయ నమః
నారాయణునకు నమస్కారము.

విలువలు - వెలుగులు

బ్రతకడం మనిషికి చేతనయింది.
కాని, బ్రతుకంటే ఏమిటో తెలియకుండా పోయింది.

బ్రతక నేర్చిన సమాజంలో
మనిషి క్షణక్షణానికి మరణిస్తాడు.
బ్రతుకు నేర్పే సమాజంలో
మనిషి అమృతరూపు డవుతాడు.

బ్రతికి తెలుసుకోలేని దౌర్భాగ్యం కన్నా
తెలిసి బ్రతికే సౌభాగ్యమే శ్రేష్ఠమని గ్రహించాలి.

విలువలు తెలిసి లాభం లేదు.
విలువలు వంట బట్టాలి.
అప్పుడే
బ్రతుకులో వెలుగులు నిండుతాయి.
వెతలు తొలుగుతాయి.

99. ఓం విశిష్ట నూపుర సత్కృతాయ నమః
గండపెండేరముచే సత్కరింపబడిన వారికి నమస్కారము





100. ఓం పరస్మై బ్రహ్మణే నమః
బ్రహ్మలకు బ్రహ్మయైన వానికి నమస్కారము.

స్నేహ పురాణం

స్నేహం చాలా గొప్పది.
స్నేహితులు స్నేహమంత గొప్పవారు కారు.

ప్రేమ చాలా విలువైంది.
ప్రేమికులు ప్రేమంత విలువైనవారు కారు.

స్నేహం లేతగా ఉండాలి. ముదరకూడదు.
అతిస్నేహం మంచిది కాదని గీతలో అచ్యుతుని అభిప్రాయం.

స్నేహితులు అవసరం లేదు.
స్నేహ జీవనం అలవరచుకోవాలి.

నది తన నీటిని కొందరికే పంచదు. ఎందరికైనా పంచుతుంది.
కొందరికి పంచితే వాళ్ళే మనవాళ్ళు.
అందరికీ పంచితే ఎవరూ మనవాళ్ళు కారు. మనం అందరికి సంబంధించి ఉంటాం.

స్నేహం మన వద్ద ఉంది.
వచ్చేవాడు ఎవడైనా మన స్నేహితుడే.

100. ఓం ప్రవచన సమ్మోహిత శ్రోతృజనాయ నమః
తమ ప్రబోధముచే ఆలకించువారిని ఆనందసాగరమున ఓలలాడించు వారికి నమస్కారము





101. ఓం పన్నగాశన వాహనాయ నమః
సర్పములను భుజించు గరుడుని వాహనముగా గలవానికి నమస్కారము.

ఎలాగైనా పోవాలి

భక్తి పవిత్రం. భక్తి కార్యాలు పరమ పవిత్రాలు.
భక్తిలో అహంకారం చేరితే భక్తి మలినపడుతుంది.
అపవిత్ర మవుతుంది. అనర్థంగా మిగుల్తుంది.

అహంకారిలో ఉండేది భక్తి కాదని చెప్పలేము.
అది భక్తే కావచ్చు. కాని, ముక్తికి ఉపకరించదు.

పాలు పవిత్రమైన ఆహారము. విషం కలిస్తే,
అప్పుడు కూడా అవి పాలే.
కాని, పాన యోగ్యం కావు.

విషం కలిసిన పాలలాగా
అహంకారం కలిసిన భక్తి నిష్ప్రయోజనం. నిరుపయోగం.



101. ఓం భవబంధ విమోచకాయ నమః
సంసార సంకెళ్ళ నుండి విడుదల చేయువారికి నమస్కారము



102. ఓం జలక్రీడా సమాసక్త గోపీ వస్త్రాప హారకాయ నమః
జలకమాడు గోపికల వస్త్రములను అపహరించిన వానికి నమస్కారము.

నిమిత్తమాత్రం భవ

రాలేందుకు బ్రతుకు రాలేదు. కాని,
రాలిపోవట మనేది కాయానికి తప్పదు.

లేచిపోయేందుకే ప్రాణా లున్నాయి.
రాలి పోయేందుకే దేహాలున్నాయి.

తెలియక, తెలివిలేక
కొంతకాలం వృథా అయింది.

తెలిసిన తరువాత,
తగిలించుకున్న వాటిని తొలగించుకోలేక
బ్రతుకు అనుక్షణం అలమటిస్తూ ఉంది.

ఎవరి కొరకు ఎవరూ లేరనే సత్యం
ఏనాడైనా వంట పట్టవలసిందే.

ఆ రోజేదో ఈరోజే అయితే,
ఈ క్షణం నుండే స్వేచ్ఛా గాలులు పీల్చుకోవచ్చు.

పరిస్థితుల్ని చక్కబరచగల మేమో గాని
ప్రారబ్ధాలను సరి చెయ్యలేము.

జరిగేవి జరిగిపోనీ!
నిమిత్త మాత్రం భవ!



102. ఓం శతాధిక జ్ఞానయజ్ఞ నిర్వాహకాయ నమః
వందకు మించిన జ్ఞానయజ్ఞములను నిర్వహించిన వారికి నమస్కారము



103. ఓం పుణ్యశ్లోకాయ నమః
పుణ్యాత్ములచే స్తుతింపబడు వానికి నమస్కారము.

నటరాజ వైభవం

ఈ విశ్వంలో అన్నీ కదుల్తూనే ఉన్నాయి.
కొన్ని మెల్లగా, కొన్ని చల్లగా
కొన్ని వెచ్చగా, కొన్ని పచ్చగా కదుల్తూనే ఉన్నాయి.

నదులు మెల్లగా కదిలి ముందుకు పోతున్నాయి.
సూర్యకిరణాలు వెచ్చగా క్రిందికి జారుతున్నాయి.
చెట్లు చలిస్తున్నాయి. పచ్చని పైరు కదుల్తూ ఉంది.
సాగర జలాలు ఆవిరై పైకి పోతున్నాయి.
మేఘాలు వర్షించి క్రిందికి వస్తున్నాయి.
నదులై ప్రవహిస్తున్నాయి. మళ్ళీ సాగరాన్ని చేరిపోతున్నాయి.

సృష్టిచక్రం ఇలా సాగుతూ ఉంది. సదా తిరుగుతూనే ఉంది.
చలిస్తూనే ఉంది. ఇదంతా సృష్టిలో గోచరించే నాట్యకళా వైభవము.

చేతులు పైకి ఎత్తినట్లు మేఘాలు లేస్తాయి.
క్రిందికి దిగినట్లు వానలు జారుతాయి.
అభినయించినట్లు సాగరంలో అలలు కదుల్తాయి.
నర్తకి తిరిగినట్లు సుడిగాలి గిర్రున తిరుగుతుంది.

ఇదంతా సృష్టిలో నాట్య వైభవము.
నటరాజ సుందరుని ప్రదోషకాల తాండవము.
బృందావన కృష్ణ చంద్రుని రాసక్రీడా వైభవము.



103. ఓం శతాధిక సత్సంగ సంయోజకాయ నమః
వంద కంటె ఎక్కువ సత్సంగ శాఖల నేర్పరచిన వారికి నమస్కారము



104. ఓం తీర్థపాదాయ నమః
చరణములయందు పుణ్యతీర్థము గలవానికి నమస్కారము.

జీవన జ్యోతి

అందాన్ని అందంగా చూడటం జ్ఞానం.
అందాన్ని అందంగా చూడలేకపోవటం అజ్ఞానం.

జ్ఞానాజ్ఞానములే కాదు; విశేషజ్ఞానం కూడా ఒకటుంది.
సుందరమైన వస్తువును సుందరంగా దర్శించడమే కాకుండా
శ్యామసుందరునిగా దర్శించి ఆనందించడం విశేషజ్ఞానం.

జగత్తును జగత్తుగా కాకుండా
జగదీశ్వరునిగా దర్శించడం విశేషజ్ఞానం.
ఈ ప్రపంచమంతా పరమేశ్వరుని వ్యక్త స్వరూపమే అనే జ్ఞానం.
జగత్తులోని విజ్ఞానమంతా ఆయన విభూతియే అనే సుజ్ఞానం.

సుజ్ఞాన ప్రదీపం బుద్ధిలో వెలుగుతూ ఉంటే
మనిషిలో సంతోషం, ప్రేమ వ్యక్తం కాకుండా ఉండలేవు.

దీపం వెలుగుతూ ఉండాలి.
మనిషి నవ్వుతూ ఉండాలి. ఆనందంగా ఉండాలి.

నూనె ఉంటేనే దీపం వెలుగుతుంది.
జ్ఞానం ఉంటేనే, సుజ్ఞానం ఉంటేనే, విశేషజ్ఞానం ఉంటేనే
మనిషి ఆనందంగా బ్రతకగలడు.

104. ఓం శతాధిక గ్రంథకర్త్రే నమః
నూటికి పైగా గ్రంథములు రచించిన వారికి నమస్కారము





105. ఓం వేదవేద్యాయ నమః
వేదములచే తెలియబడు వానికి నమస్కారము.

మోక్షధామం

నీరు అంతా ఒక్కటే.
ఎవరు త్రాగితే వారి దప్పిక తీరుతుంది.

జ్ఞాన మంతా ఒక్కటే.
ఎవరు పొందితే వారికే ఉంటుంది.

తినడానికి ఎన్నైనా ఉండొచ్చు.
తినేవాడికి ఆకలి ఉండాలి. ఆసక్తి ఉండాలి.

తెలుసుకోవటానికి జ్ఞానం సిద్ధంగా ఉండొచ్చు.
తెలుసుకొనేవాడికి ఆర్తి ఉండాలి. భక్తి ఉండాలి.

భక్తి నైవేద్యంగా మారితే,
ముక్తి ప్రసాదంగా అందుతుంది.



105. ఓం స్థిరాయ నమః
అచల స్వరూపునకు నమస్కారము



106. ఓం దయానిధయే నమః
కరుణకు నిధియైన వానికి నమస్కారము.

చేదు నిజం

మనం సుఖపడటం పరులపై ఆధారపడినట్లైతే
మన సుఖాన్ని నిర్ణయించేవారు ఇతరులు అవుతారు.
ఇదే నిజమైతే, మన సుఖం మాకుల నీడయే అవుతుంది.

మనం తెలివిగలవాళ్ళం కావచ్చు. మనకు వివేకం ఉండవచ్చు.
ఎవరు ఏది తెలుసుకున్నా, ఎంత తెలుసుకున్నా
జీవితంలోనే తెలుసుకున్నాం. జీవిస్తూనే తెలుసుకున్నాం. తెలుసుకొంటున్నాం.

ఇంతకీ
జీవితం మనకు నేర్పిందేమిటి?
ఏ ఒక్కరు మరొకర్ని సుఖపెట్టలేరని,
ఏ వస్తువు సదా సుఖాన్ని పంచలేదని,
ఏ పరిస్థితీ సదా మనల్ని ఆనందంగా ఉంచలేదని.

దీనికి ఋజువేమిటి?
మన జీవితమే.



106. ఓం స్వతంత్రాయ నమః
తనకు తానే ఆధార స్వరూపమై ఉన్న వారికి నమస్కారము



107. ఓం సర్వతీర్థాత్మకాయ నమః
సమస్త పుణ్యతీర్థముల స్వరూపమైన వానికి నమస్కారము.

ప్రేమ జలం

సాధనకు రోదన తెలియదు. అది ప్రేమకార్యం.
ప్రేమకార్యంలో కష్టముండదు. నష్టముండదు.

మనం ప్రేమించేవారికి
వారిపై మనకున్న ప్రేమకు పెద్ద తేడా లేదు.

సాధ్యరూపుడైన పరమాత్మకు
పరమాత్మకు సంబంధించిన సాధనకు మధ్య కూడా పెద్ద తేడా లేదు.

ఇది అర్థమైతే,
ఆ క్షణం నుండి సాధన గాలిలాగా తేలిపోతూ ఉంటుంది. తేలికగా ఉంటుంది.

ప్రతిక్షణం హృదయంలో
పరమాత్మే తేలుతూ ఉంటాడు.
ప్రపంచం మునుగుతూ ఉంటుంది.

107. ఓం పరమ గురవే నమః
గురువుల కెల్ల గురువైన వారికి నమస్కారము





108. ఓం సర్వగ్రహరూపీ పరాత్పరాయ నమః
సర్వగ్రహ రూపుడై దేవతలందరికి ఆదిదేవుడైన వానికి నమస్కారము.

సెలవు

భగవాన్!
చాచే చేతులు పూచే పూలను తాకే దెప్పుడు?
కనులు చేతులై నీ పదకమలము చేరే దెప్పుడు?

కాయలు కాచినవి చేతులు రాసి రాసి
ఫలము లయ్యేదెప్పుడు కలము కళలు పండి

కట్టలేను పరంజ ఈ ప్రపంచ అపరంజి మేడకు
చెంగుచెంగున గంతులిడి అరుదెంతు నీ చల్లని నీడకు

ఎన్నో రాత్రులు మేల్కొంటిని నిను మెప్పింప
ఎన్నో వేదిక లెక్కితిని నీ మహిమ చాటింప
ఎన్నెన్నో గుడులు తిరిగితి నిను దర్శింప
ఇక తిరగలేక చతికిల బడితి నీవు కరుణింప!



108. ఓం సుందర చైతన్యానంద స్వామినే నమః
శ్రీసుందర చైతన్యానంద స్వామి వారికి నమస్కారము

మధుర మధుర భావనలే
నీ సేవలో పువ్వులు
నా గుండెలో గుసగుసలు
వినిపించును గుడిగంటలు
నా కవితే కోవెల
నా పూజకు తరలిరా

